జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, ఏడ్యూటికవర్గ ఇంఛార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.

అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు

9440231967, 7989694528

రంగారెడ్డి | శనివారం 7 ఫిబ్రవరి 2026 | సంపుటి : 1 | సంచిక : 39 | వెల: రూ.5 | పేజీలు: 08 | RNI NO.APTEL/2010/36516

విక్రం సంవత్సరం - పింగళ 2081, ఆషాఢము 3 ఇండియన్ సివిల్ క్యాలెండర్ - 1946, ఆషాఢము 17 పుర్నిమంతా - 2081, ఆషాఢము 16 అమాంత - 2081, ఆషాఢము 3 తిథి శుక్లపక్షం తదియ నక్షత్రం పుష్యమి

Published from RANGAREDDY, WARANGAL, KAMMAM, NALAGONDA http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

## మూడు వారాల్లో
# తేల్చాల్సిందే!



- లేకపోతే మేమే జోక్యం చేసుకుని చర్యలు చేపడతాం
- ఫిరాయింపులపై స్పీకర్‌కు సుప్రీంకోర్టు స్పష్టీకరణ
- తదుపరి విచారణ మూడు వారాలకు వాయిదా
- ఒకవేళ నిర్ణయం వెలువడకపోతే తామే నేరుగా జోక్యం చేసుకుని తదుపరి చర్యలు చేపట్టాల్సి ఉంటుందని స్పష్టం
- 'అనర్హత పిటిషన్లపై విచారణ ప్రక్రియ ఇప్పటికే కొనసాగుతోంది
- పెండింగ్‌లో ఉన్న మొత్తం పిటిషన్లలో ఒకదానిపై ఇప్పటికే నిర్ణయం

**న్యూఢిల్లీ**

తెలంగాణలో ఫిరాయింపు ఎమ్మెల్యేల అనర్హత వ్యవహారంపై సుప్రీంకోర్టు మరో సారి డెడ్ లైన్ విధించింది. అనర్హతలకు సంబంధించి దాఖలైన పిటిషన్లపై నిర్ణయం తీసుకోవడంలో జరుగుతున్న కాలయాపనపై తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. మూడు వారాల్లోగా ఈ పిటిషన్లపై నిర్ణయం తీసుకోవాలని అసెంబ్లీ స్పీకర్‌ను ఆదేశించింది. ఒకవేళ నిర్ణయం వెలువడకపోతే తామే నేరుగా జోక్యం చేసుకుని తదుపరి చర్యలు చేపట్టాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మసీద్‌లతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఈ కేసును విచారించింది. తెలంగాణ ప్రభుత్వం, తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ తన వాదనలు - మిగతా 2లో

కాంగ్రెస్ పాలనలో స్కామ్‌లే..
## స్కీమ్‌లు లేవు



- కారుకు ఓటేసి కేసీఆర్‌ను సీఎం చేసే ప్రస్థానం ప్రారంభించండి 2లో
- సిరిసిల్ల, వేములవాడ ప్రచార సభల్లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



## వాయిదా పర్వం

- సభ ప్రారంభం కాగానే విపక్ష సభ్యులు పలు అంశాలపై ఆందోళన
- ప్లకార్డులు ప్రదర్శిస్తూ, నినాదాలు చేస్తూ వెల్‌లోకి దూసుకెళ్లారు

3లో

## కాంగ్రెస్, భారాస
# తోడు దొంగలు

- 14%ముస్లిం రిజర్వేషన్లకు రేవంత్‌రెడ్డి యత్నం
- బీసీలు ఓట్లతోనే కాంగ్రెస్‌కు గుణపాఠం చెబుతారు
- కాంగ్రెస్ సుప్రీంకోర్టుకు వెళ్లి స్టే పొంది అమలు చేస్తోంది
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



**హైదరాబాద్-ఆమనగల్లు**

ముస్లింలకు మొత్తంగా 14 శాతం రిజర్వేషన్లను కల్పించి అసలైన బీసీలకు అన్యాయం చేయడానికి సీఎం రేవంత్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆరోపించారు. శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. "ఉమ్మడి ఏపీలో కాంగ్రెస్ పార్టీ 4 శాతం ముస్లిం రిజర్వేషన్లను ప్రవేశపెట్టిన సందర్భంలో హైకోర్టు వాటిని రెండుసార్లు కొట్టివేసింది. కాంగ్రెస్ సుప్రీంకోర్టుకు వెళ్లి స్టే పొంది అమలు చేస్తోంది. కులసర్వే ముసుగులో కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవల ఒక సర్వే నిర్వహించి రాష్ట్రంలో బీసీ జనాభాను పెద్దమొత్తంలో - మిగతా 2లో



## అబూజ్‌మాడ్‌లో భారీ ఎన్‌కౌంటర్

- ఎదురుకాల్పుల్లో ఏడుగురు మావోయిస్టుల హతం
- మృతుల్లో మావోయిస్టు అగ్రనేత, తెలంగాణ వాసి ప్రభాకర్
- సీ60 జవాన్ దీపక్ చిన్న మడావి మృతి
- మూడు ఏకే47 తుపాకుల స్వాధీనం

3



## విద్య.. మోయలేని భారం కాదు

- పరీక్షలను పండుగలా భావించాలి
- మార్కులు ఒక్కటే పరమావధి కాదు
- జీవితాన్ని మెరుగుపర్చుకోవడంపై దృష్టి పెట్టాలి
- బలమైన సంకల్పం ఉంటే జీవన విధానం మారుతుంది

3



## బదులిచ్చే ధైర్యం ప్రధానికి లేదు

- పదేపదే అబద్ధాలు చెప్పడమే మోదీ పని
- "రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాద తీర్మానంపై మోదీ తన 97 నిమిషాల ప్రసంగంలో ముఖ్యమైన, అవసరమైన విషయం ఒక్కటీ చెప్పలేదు
- ఇంకా వందేళ్లు, 75 ఏళ్లు, 50 ఏళ్ల కిందటి సంగతులే మాట్లాడుతున్నారు

## గోదావరి జలాలను అడ్డుపెట్టుకుని..
# తెలంగాణను కొల్లగొట్టారు



- రూ.లక్ష కోట్లు తిన్న కేసీఆర్, కేటీఆర్‌లను కాపాడుతున్నదెవరు?
- కేసీఆర్‌కు దత్తపుత్రుడిలా కిషన్‌రెడ్డి వ్యవహారశైలి
- భారాస, భాజపా ఒకటే.. వారికి ఓటేస్తే మూసీలో కలిసినట్లే..
- 70 వేల ఉద్యోగాలిచ్చాం.. లెక్క పెట్టుకోండి..
- ఇందులో ఒక్క తల తగ్గినా నా తల తీసుకుంటా..సీఎం రేవంత్‌రెడ్డి సవాల్

**నిజామాబాద్**

గోదావరి జలాలను అడ్డం పెట్టుకుని అప్పటి భారాస పాలకులు తెలంగాణను కొల్లగొట్టారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విరుచుకుపడ్డారు. 'కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో రూ.లక్ష కోట్లు దిగమింగిన కేసీఆర్, కేటీఆర్‌లను కాపాడుతున్నదెవరు' అంటూ భాజపా నేతలను ప్రశ్నించారు. మున్సిపల్ ఎన్నికల్లో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ప్రజలు కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండలం బర్ధీపూర్ శివారులో శుక్రవారం నిర్వహించిన 'ప్రజాపాలన-ప్రగతిబాట' బహిరంగ సభలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ తదితరులతో కలిసి ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగించారు. "భారాస హయాంలో కాళేశ్వరాన్ని ఏటీఎంగా మార్చారని ప్రధాని మోదీ, అమిత్‌షా అప్పట్లో ఆరోపించారు. తమకు అవకాశమిస్తే 48 గంటల్లో కేసీఆర్, హరీశ్‌లను జైల్లో పెడతామని చెప్పారు. మేం శాసనసభలో చర్చించి.. ఆరు నెలల కిందటే కాళేశ్వరం అంశాన్ని సీబీఐకి ఇచ్చాం. 48 గంటల్లో బాధ్యులను జైల్లో పెడతానన్న కిషన్‌రెడ్డి ఎక్కడ దాక్కున్నారు? ఫార్ములా-ఈ కేసును కేంద్రానికి పంపిస్తే మోదీ కార్యాలయంలో మూలన పడేశారు. భారాస నాయకులను కాపాడుతున్నదెవరో నిజామాబాద్ ఎంపీ అర్వింద్‌కు కనిపించడం లేదా? తెలంగాణ నుంచి 8 మంది భాజపా ఎంపీలను గెలిపిస్తే మోదీ నిధులు ఇవ్వరా? కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లను కేంద్ర మంత్రులుగా చేశారు కానీ.. హైదరాబాద్ మెట్రో విస్తరణకు, మూసీ ప్రక్షాళనకు, రీజినల్ రింగ్‌రోడ్డుకు ఒక్క రూపాయి ఇవ్వలేదు. భారాస, భాజపాలది విడదీయరాని బంధం. వీళ్లలో ఎవరు గెలిచినా ఒకటే. వారికి ఓట్లు వేస్తే మూసీలో కలిసినట్లే. భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావును ఒక్కటే - మిగతా 2లో

# అబూజ్‌మాడ్‌లో భారీ ఎన్‌కౌంటర్

వరంగల్/కాళేశ్వరం:

మహారాష్ట్ర ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లోని అబూజ్‌మాడ్ అటవీ ప్రాంతంలో భారీ ఎన్‌కౌంటర్ సంభవించింది. పోలీసులుమావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ఏడుగురు మావోయిస్టులు హతమయ్యారు. మృతుల్లో మహారాష్ట్రలోని గడ్చిరోలి డివిజన్ కమిటీ ఇన్‌చార్జి, వెస్ట్ సబ్‌జోనల్ బ్యూరో ఇన్‌చార్జి, సీపీఐ (మావోయిస్ట్) కంపెనీ నంబర్ 10 ఇన్‌చార్జి ప్రభాకర్ (తెలంగాణ, కామారెడ్డి జిల్లా వాసి) కూడా ఉన్నారు. ప్రభాకర్‌పై తెలంగాణ, మహారాష్ట్రల్లో రూ.50 లక్షల రివార్డు ఉంది. గత మూడు రోజులుగా కొనసాగిన ఆపరేషన్‌లో గురువారం రాత్రి వరకు ముగ్గురు మావోయిస్టుల మృతదేహాలను పోలీసులు స్వాధీనం చేసుకోగా, శుక్రవారం ఆపరేషన్లలో మరో నలుగురు (ఇద్దరు పురుషులు, ఇద్దరు మహిళలు) మావోయిస్టుల మృతదేహాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. మొత్తం మృతుల్లో నలుగురు పురుషులు, ముగ్గురు మహిళలు ఉన్నారు. మిగిలిన మావోయిస్టుల గుర్తింపు.. నిర్ధారణ కావాల్సి ఉంది. ఘటనాస్థలం నుంచి మూడు ఏకే47 రైఫిళ్లు, 1 ఎస్ఎల్ఆర్, ఒక 303 పిస్టల్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఆపరేషన్‌లో సీ60 జవాన్ దీపక్ చిన్న మాడవి (38) మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. అహేరి తాలూకా మంద్రా గ్రామానికి చెందిన ఆయన గురువారం ఇద్దరు మావోయిస్టులను హతమార్చారు. అదే సమయంలో గుండెపోటు రావడంతో హెలికాప్టర్‌లో బ్రామగడ్ సబ్‌డిస్ట్రిక్ట్ ఆస్పత్రికి తరలించగా, అక్కడ మృతిచెందారు. మరో సీ60 జవాన్ జోగా మాడవ్‌కు బుల్లెట్ గాయాలయ్యాయి. ఆయనను హెలికాప్టర్‌లో గడ్చిరోలికి తరలించి వైద్యం చేస్తున్నారు. ఆపరేషన్‌కు సంబంధించిన పూర్తి వివరాలను గడ్చిరోలి పోలీసులు శనివారం విలేకరుల సమావేశంలో వెల్లడించనున్నారు.



**1995లో అజ్ఞాతంలోకి..**

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: మహారాష్ట్ర గడ్చిరోలి ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన సీనియర్ మావోయిస్టు ప్రభాకర్ అలియాస్ పడ్కల్ స్వామి అలియాస్ లోకేటి చందర్ రావు (60)ది కామారెడ్డి జిల్లా ఇస్రోజివాడి గ్రామం. 1995లో అడవిబాట పట్టిన ఆయన తిరిగి ఇంటిముఖం చూడలేదు. అప్పట్లో తండ్రి చనిపోయినా, మూడేళ్ల కిందట తల్లి చనిపోయినా ఇంటికి రాలేదు. సిర్నాపల్లి దళ కమాండర్‌గా, జిల్లా కమిటీ సభ్యుడిగా, జిల్లా కార్యదర్శిగానూ పనిచేశారు. పోలీసు నిర్బంధం పెరిగిన సమయంలో ఆయన్ను దండకారణ్యానికి పంపించారు. అక్కడ పీపుల్స్ గెరిల్లా లిబరేషన్ ఆర్మీకి ప్రభాకర్ నాయకత్వం వహించినట్టు తెలుస్తోంది. ఇటీవల ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన హిడ్మా నాయకత్వంలో ఆయన పనిచేసినట్టు ఈ మధ్య లొంగిపోయిన ఓ మావోయిస్టు నేత చెప్పారు. ప్రభాకర్ వెళ్లిన కొంత కాలానికి ఆయన భార్య నవత అలియాస్ లోకేటి సులోచన కూడా అజ్ఞాతంలోకి వెళ్లింది. ఎనిమిదేళ్ల కిందట అనారోగ్యంతో దండకారణ్యంలో చనిపోయింది. ఆయన కొడుకు రమేశ్ అలియాస్ అశోక్, కూతురు లావణ్య కూడా తల్లిదండ్రుల బాటలో నడిచారు. రెండు నెలల కిందట రమేశ్ లొంగిపోగా, లావణ్య ఛత్తీస్‌గఢ్‌లో అరెస్టయి జైల్లో ఉన్నారు.

# విద్య.. మోయలేని భారం కాదు

న్యూఢిల్లీ

విద్యాభ్యాసం అంటే మోయలేని భారంగా భావించొద్దని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సూచించారు. కేవలం మార్కులపైనే కాకుండా జీవితాన్ని మెరుగుపర్చుకోవడంపై దృష్టి పెట్టాలని చెప్పారు. ఇతరులు చెప్పేది వినాలని.. చివరకు మన జీవితానికి సంబంధించిన నిర్ణయం మనమే తీసుకోవాలని పేర్కొన్నారు. మారాలన్న బలమైన సంకల్పం ఉన్నప్పుడే మన జీవన విధానం మారుతుందని స్పష్టంచేశారు. పరీక్షలు వస్తున్నాయంటే భయపడాల్సిన పని లేదని, పరీక్షలను పండుగలా భావిస్తూ ఆనందంగా జరుపుకోవాలని వెల్లడించారు. 'ప్రధానమంత్రితో పరీక్షా పే చర్చ2026'కార్యక్రమంలో భాగంగా దేశంలోని వేర్వేరు ప్రాంతాల నుంచి వచ్చిన పాఠశాల విద్యార్థులతో మోదీ ఢిల్లీలోని తన నివాసంలో సమావేశమయ్యారు. త్వరలో పరీక్షలు రాయబోతున్న విద్యార్థులకు విలువైన సూచనలు చేశారు. ఒత్తిడిని జయించి, పరీక్షలకు హాజరైతే విజయం సొంతమవుతుందని అన్నారు. విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. ఈ వీడియోను మోదీ శుక్రవారం 'ఎక్స్'లో పోస్టుచేశారు. పరీక్షలను పూర్తి ఆత్మవిశ్వాసంతో ఎదుర్కోవడంపై విద్యార్థులతో చక్కటి చర్చ జరిగిందని వివరించారు. ఈ వీడియోను అందరూ తిలకించాలని కోరారు. పరీక్షా పే చర్చలో ప్రధానమంత్రి ఏం చెప్పారంటే.

**మనపై మనకు విశ్వాసం ఉండాలి**

"కంఫర్ట్ జోన్‌లో ఉండిపోతే జీవితం మారదు. అందుకోసం జీవన విధానం మార్చుకోవాలి. విద్యను భారంగా భావించకుండా అందులో పూర్తిగా నిమగ్నం కావాలి. అరకొరగా చదివితే ఉపయోగం ఉండదు. కేవలం మార్కులే పరమావధిగా భావించకుండా జీవితంపైనా దృష్టి పెట్టాలి. తల్లిదండ్రులు, టీచర్లు, మిత్రులు ఏం చెప్పారన్నది కాకుండా మనపై మనకు విశ్వాసం ఉండాలి. ఇతరులు చెప్పేది మనసులో పెట్టుకోవాలి.

మన జీవితాన్ని మార్చే నిర్ణయం మనమే తీసుకోవాలి. ఆశించిన లక్ష్యం సమీపంలోనే ఉంటుంది. కానీ, దాన్ని అందుకోవాలంటే కష్టపడాలి. మనసును అదుపులో పెట్టుకొని చదివితే అనుకున్నది సాధించడం సులభమే. మార్కుల కోసం ఎక్కువ ఆరాట పడొద్దు. గత ఏడాది బోర్డు పరీక్షలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థి పేరు ఎవరికైనా గుర్తుందా? చాలావరకు గుర్తుండదు. అలాంటి విద్యార్థిని కొద్దిసేపు ప్రశంసిస్తాం, తర్వాత మర్చిపోతాం. అందుకే పరీక్షల్లో మార్కులే ముఖ్యమని భావించడానికి వీల్లేదు.

**చదువులో సొంత విధానం ఉండాలి**

విద్యార్థుల భవిష్యత్తు గురించి తల్లిదండ్రులు ఆందోళన చెందుతుంటారు. చదువు విషయంలో ఒత్తిడి చేస్తుంటారు. చదివే విధానం గురించి తల్లిదండ్రులు ఒకలా, టీచర్లు మరొకలా చెబుతుంటారు. విద్యార్థులు ఇంకోలా భావిస్తుంటారు. మొత్తానికి వారిలో గందరగోళం ఏర్పడుతుంది. ఏది సరైందో నిర్ణయించుకోలేరు. ఒక ఇంటిలో తోబుట్టువుల్లోనే ఎన్నో వ్యత్యాసాలు ఉంటాయి. ఎవరి సొంత విధానం వారికే ఉంటుంది. అందుకే చదువు విషయంలో మీకు ఏది నచ్చితే అదే చేయండి.

కొందరు రాత్రిపూట చదువుకోవడానికి, మరికొందరు ఉదయం పూట చదువుకోవడానికి ఇష్టపడుతుంటారు. మీకు ఎప్పుడు చదుకోవడం వెసులుబాటుగా ఉంటుందో అప్పుడే చదువుకోండి. సొంత విధానాన్ని నమ్ముకోవాలి. ఇతరుల సూచనలు జాగ్రత్తగా వింటూ..



సొంత అనుభవాల ద్వారా ఆ విధానంలో మార్పులు చేసుకోవచ్చు. ఎవరో ఏదో చెప్పారని గుడ్డిగా అనుసరించాల్సిన పనిలేదు. నేను 'పరీక్షా పే చర్చ'ను ప్రారంభించినప్పుడు కొన్నాళ్లు ఒకేలాగా కొనసాగింది. తర్వాత మెరుగుపర్చాం. వేర్వేరు రాష్ట్రాల్లో సెషన్లు నిర్వహించాం. మూలానికి కట్టుబడి ఉంటూనే ఫార్మాట్ మార్చాం.

**జరిగిపోయిన దాని గురించి ఎందుకు?**

విద్యార్థులు గతాన్ని తవ్వుకుంటూ సమయం వృథా చేయొద్దు. భవిష్యత్తు గురించి ఆలోచించాలి. జరిగిపోయిన దాని గురించి నేను అంతగా పట్టించుకోను. ఇకపై ఏం జరగబోతోందో దానిపైనే నా దృష్టి ఉంటుంది. పరీక్షల్లో రాబోయే ముఖ్యమైన ప్రశ్నలు, సమాధానాలు మాత్రమే టీచర్లు బోధించే విధానం గతంలో ఉండేది. పరీక్షల్లో మంచి మార్కుల కోసం అలా చేసేవారు. నిజానికి ఒక మంచి టీచర్ జీవితానికి పనికొచ్చే అన్ని అంశాలూ బోధిస్తాడు. విద్యార్థులు సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తాడు. జీవితం అంటే పరీక్షలు ఒక్కటే కాదు, జీవితంలో పైకి ఎదగడానికి విద్య ఒక సాధనం. నేను ప్రధానమంత్రిని అయ్యాను. విభిన్నంగా పనిచేయండి అని ప్రజలు చెబుతుంటారు. మీరు కూడా విభిన్నంగా చదవడం ప్రయత్నించండి.

**ఇంటర్నెట్‌పై సమయం వృథా చేయొద్దు**

ఇంటర్నెట్‌లో గేమింగ్‌లు పక్కనపెట్టి చదువుపైనే దృష్టి పెట్టాలంటూ విద్యార్థులపై సమాజం నుంచి ఒత్తిడి ఉన్నమాట నిజమే. గేమింగ్ అంటే ఒక అభిరుచి మాత్రమే కాదు.. అదొక నైపుణ్యం. అందులో రాణించాలంటే వేగం, అప్రమత్తత అవసరం. సెల్ఫ్ డెవలప్‌మెంట్‌కు గేమింగ్ తోడ్పడుతుంది. నాణ్యమైన గేమ్‌ల్లో అనుభవం పెంచుకోండి. అదేసమయంలో చదువును నిర్లక్ష్యం చేయొద్దు. గేమింగ్‌లో జూదానికి దూరంగా ఉండాలి. జూదాన్ని అరికట్టే చట్టాలు మనదేశంలో ఉన్నాయి. ఆన్‌లైన్ బెట్టింగ్‌లు చాలా ప్రమాదకరం.

దేశంలో ఇంటర్నెట్ చౌకగా దొరుకుతోంది కదా అని దానిపైనే సమయం వృథా చేయకండి. నిర్మాణాత్మక నైపుణ్యాలు పెంచుకోవడం కోసం గేమ్‌లు ఆడొచ్చు. భారతీయ సంస్కృతి, పురాణ గాథలతో ముడిపడి ఉన్న స్టోరీ టెల్లింగ్ గేమ్‌లను అభివృద్ధి చేయండి. వాటిని సోషల్ మీడియాలో పంచుకుంటే చక్కటి గుర్తింపు లభిస్తుంది. అప్పుడు తల్లిదండ్రులు సంతోషిస్తారు. మరింత ప్రోత్సహిస్తారు. కొత్త ఐడియాలు ఇస్తారు. పంచతంత్ర కథల ఆధారంగా గేమ్‌ను అభివృద్ధి చేయొచ్చు. మీరు క్రియేటర్‌గా మారండి. సొంతంగా సోషల్ మీడియా పేజీ ప్రారంభించండి.

**విద్యార్థి ఒక అడుగు ముందే ఉండాలి**

విద్యార్థి వేగం ఎల్లప్పుడూ టీచర్ వేగం కంటే ఎక్కువే ఉండాలి. అలా ఉండేలా చూసే బాధ్యత టీచర్లదే. అంటే టీచర్ కంటే విద్యార్థి ఒక అడుగు ముందే ఉండాలి. విద్యార్జనలో సమతూకం ఉండేలా జాగ్రత్తపడాలి. చదువుతోపాటు విశ్రాంతి, నైపుణ్యాలు, అభిరుచులకు ప్రాధాన్యం ఇవ్వాలి. లైఫ్ స్కిల్స్, ప్రొఫెషనల్ స్కిల్స్ అని రెండు రకాల నైపుణ్యాలు ఉంటాయి. ఆ రెండింటినీ విడదీసి చూడలేం. కేవలం ఒకదానివైపే మొగ్గు చూపితే జీవితంలో విఫలమవుతారు. రెండు రకాల నైపుణ్యాలూ సమానమే"అని ప్రధాని మోదీ వివరించారు.

**గిన్నిస్ రికార్డుకెక్కిన చర్చ**

ప్రధాని మోదీ ఆధ్వర్యంలో 'పరీక్షా పే చర్చ'2018లో ప్రారంభమైంది. ప్రతిఏటా ఆయన విద్యార్థులతో సంభాషిస్తున్నారు. వార్షిక పరీక్షల ముందు వారిలో ఆత్మస్థైర్యం నింపుతున్నారు. పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నారు. ఇది దేశంలో అతిపెద్ద విద్యా కార్యక్రమాల్లో ఒకటిగా గుర్తింపు పొందింది. పరీక్షా పే చర్చలో పాల్గొనడం కోసం 2023లో 38.8 లక్షల మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకోగా, 2025లో ఆ సంఖ్య 3.53 కోట్లకు చేరింది. ఈ ఏడాది 4.5 కోట్ల మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఈ కార్యక్రమం ఇప్పటికే గిన్నిస్ బుక్ రికార్డుకెక్కింది.

**ఇంకా 25 ఏళ్లు ఉన్నాయి**

పరీక్షా పే చర్చలో విద్యార్థులతో మోదీ ఒక ఆసక్తికరమైన విషయం పంచుకున్నారు. గత ఏడాది సెప్టెంబర్ 17వ తేదీన ఆయన 75వ జన్మదినం జరిగింది. ఈ సందర్భంగా ఓ నాయకుడు ప్రధానమంత్రికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. మీకు 75 ఏళ్లు వచ్చాయంటూ గుర్తుచేశారు. మోదీ బదులిస్తూ.. 75 ఏళ్లు రావడం కాదు, ఇంకా 25 ఏళ్లు ఉన్నాయని చెప్పారు. మణిపూర్ సైనిక్ స్కూల్ నుంచి వచ్చిన ఇమోటా కె.శ్యామ్ అనే విద్యార్థి మోదీతో మాట్లాడాడు. చిన్నప్పటి నుంచి మీరంటే ఎంతో స్ఫూర్తి అని అన్నాడు. తన పుట్టినరోజు గురించి తెలిపాడు. మోదీ స్పందిస్తూ... 'జరిగిపోయినదాన్ని నేను లెక్కపెట్టను. జరగబోయేది మాత్రమే లెక్కిస్తా. మీకు నేను చెప్పేది ఒక్కటే. పాత విషయాల గురించి ఆలోచిస్తూ టైమ్ వేస్టు చేసుకోకండి. జరగబోయేదే ఆలోచించండి. మిగిలిన జీవితం ఎలా జీవించాలో యోచించండి"అని సూచించారు.

## బదులిచ్చే ధైర్యం ప్రధానికి లేదు

న్యూఢిల్లీ

ప్రధాని నరేంద్ర మోదీ రాజ్యసభలో చేసిన ప్రసంగంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే శుక్రవారం విమర్శలు గుప్పించారు. తమ ప్రశ్నలకు సమాధానం చెప్పే ధైర్యం ప్రధానికి లేదన్నారు. ప్రభుత్వం సభను ప్రజాస్వామ్య పద్ధతిలో నడపాలనుకోవడం లేదని ఆరోపించారు. పదేపదే అబద్ధాలు చెప్పడమే మోదీ పని అని ఆరోపించారు. "రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాద తీర్మానంపై మోదీ తన 97 నిమిషాల ప్రసంగంలో ముఖ్యమైన, అవసరమైన విషయం ఒక్కటీ చెప్పలేదు. ఇంకా వందేళ్లు, 75 ఏళ్లు, 50 ఏళ్ల కిందటి సంగతులే మాట్లాడుతున్నారు" అని ఎద్దేవా చేశారు. "లోక్‌సభ విపక్ష నేత రాహుల్ గాంధీ ప్రస్తావించిన ఆర్మీ మాజీ చీఫ్ నరవణే పుస్తకం ఇంకా ప్రచురణ కాలేదని అధికార పక్షం పార్లమెంటులో చెబుతోంది. తాము ఆ పుస్తకాన్ని బాహాటంగా చూపినా వారికి అర్థం కావడం లేదు. ముందుగా వాస్తవాలను శ్రద్ధగా విని, ఆపై సమాధానం చెప్పాలి" అని ఖర్గే అన్నారు. రాహుల్, కేంద్ర మంత్రి రవ్‌నీత్ బిట్టూ వివాదంపైనా ఆయన స్పందించారు. సభ బయట ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన సంభాషణను సిక్కులకు జరిగిన అవమానంగా ముద్ర వేశారని మండిపడ్డారు. "సిక్కులను కాంగ్రెస్ పార్టీ ఎంతో గౌరవిస్తుంది. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో మన్మోహన్ సింగ్ ఆర్థిక మంత్రిగా, తర్వాత ప్రధానిగా పనిచేశారు" అని గుర్తు చేశారు. సిక్కులను, దళితులను, ఆదివాసీలను ఎవరినీ గౌరవించే అలవాటు లేనిది బీజేపీకేనన్నారు. ఇతరు లను ఎలా కించపరచాలా అనే మోదీ ఆలోచిస్తారని ఖర్గే ఆరోపించారు. "దేశంలో ప్రభుత్వ రంగ సంస్థలను స్థాపించిందే తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ. కానీ మోదీ మాత్రం వాటిని దివాలా తీసే కర్మాగారాలు అని పిలుస్తూ నెహ్రూపై విమర్శలు చేస్తున్నారు. దేశాన్ని నడిపే దార్శనికత మోదీకి లేదు" అన్నారు. రాహుల్ ఏం ప్రశ్నలు అడుగుతారో, ఎలాంటి వాస్తవాలు బయటపెడతా రోనని మోదీ భయపడుతున్నారని ఎద్దేవా చేశారు. "లోక్‌సభలో మోదీపై దాడి జరుగుతుందని నిఘా సమాచారముందని చెబుతున్నారు. అంత గొప్ప ఇంటలిజెన్స్ పుల్వామా వంటి ఉగ్ర దాడుల సమయంలో ఏమైంది?" అని ఖర్గే ప్రశ్నించారు. "ఎప్‌స్టీన్ ఫైల్స్ బయటపడ్డ తరవాత మోదీ ఆందోళనగా ఉన్నారు. అందుకే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు లొంగిపోయి ఆ దేశంతో ఏకపక్ష వాణిజ్య ఒప్పందం కుదుర్చు కున్నారు. తద్వారా మన దేశ రైతులను బలిపశు వులను చేశారు" అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## వాయిదా పర్వం

న్యూఢిల్లీ

లోక్‌సభలో వి పక్షాల ఆందోళనలు శుక్రవారం కూడా నిర్నిరోధంగా కొనసాగాయి. దాంతో కార్యకలాపాలేవీ సాగించకుండానే సభ మరోసారి వాయిదాపడింది. ఉదయం సభ ప్రారంభం కాగానే విపక్ష సభ్యులు పలు అంశాలపై ఆందోళనకు దిగారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ, నినాదాలు చేస్తూ వెల్‌లోకి దూసుకెళ్లారు. స్పీకర్ ఓం బిర్లా వారించినా లాభం లేకపోయింది. దాంతో, ఇలాంటి అంతరాయాలతో ఈ సమావేశాల్లో ఇప్పటికే ఏకంగా 19 గంటల విలువైన సభా సమయం వృథా అయిందంటూ ఆయన ఆవేదన వెలిబుచ్చారు. కాంగ్రెస్ సభ్యురాలు ప్రియాంకగాంధీ అడగాల్సిన ప్రశ్న కూడా జాబితాలో ఉందని తెలిపారు. అయినా లాభం లేకపోవడంతో, ఇటువంటి సభను తాను నడపలేనంటూ స్పీకర్ ఆగ్రహం వెలిబుచ్చారు. నాలుగు నిమిషాలకే సభను వాయిదా వేశారు. మధ్యాహ్నం 12 గంటలకు తిరిగి సమావేశమయ్యాక కూడా అవే దృశ్యాలు కన్పించాయి. సభ్యులు నినాదాల నడుమ తిరిగి వెల్‌లోకి దూసుకెళ్లారు. తమ స్థానాల్లోకి తిరిగి వెళ్లాల్సిందిగా ప్యానెల్ స్పీకర్ కృష్ణప్రసాద్ తెన్నేటి పదేపదే విజ్ఞప్తి చేసినా లాభం లేకపోయింది. దాంతో సభను సోమవారానికి వాయిదా వేస్తున్నట్టు ఆయన ప్రకటించారు.

**వారం రోజులుగా...**

లోక్‌సభ గత సోమ వా రం నుంచీ విపక్షాల నిరసనలలో అట్టుడు కుతోంది. పలు అంశాలపై అధికార, విపక్షాలు నడుమ నువ్వా, నేనా అన్నట్టు తలపడుతున్నాయి. 2020 భారత్‌చైనా ఘర్షణకు సంబంధించి నాటి ఆర్మీ చీఫ్ ఎం.ఎం.నరవణె రాసిన పుస్తకంలోని అంశాలను ప్రస్తావించేందుకు రాహుల్ చేసిన ప్రయత్నం వివాదానికి దారి తీయడం తెలిసిందే. దానిపై మొదలైన రగడ కొనసాగుతూనే ఉంది. దాంతో రాష్ట్రప తి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానాన్ని గత 22 ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా ప్రధాని సమాధానం లేకుండానే సభ ఆమోదించింది.

**కాంగ్రెస్ నిరసన**

లోక్‌సభ వాయిదా పడ్డాక పార్లమెంటు ప్రాంగణంలో మకరద్వారం వద్ద కాంగ్రెస్‌తో పాటు పలు ఇతర పార్టీల ఎంపీలు నిరసనకు దిగారు. అమెరికాతో వాణిజ్య ఒప్పందం, నరవణె పుస్తకం, 8 మంది ఎంపీల సస్పెన్షన్ తదితరాలపై నినాదాలతో హోరెత్తించారు. 'వాణిజ్య వల'అంటూ అమెరికా ఒప్పందంపై బ్యానర్ ప్రదర్శించారు. ప్రియాంక, సస్పెండైన ఎంపీలతో పాటు పలువురు వీటిలో పాల్గొన్నారు.

## అర్ధరాత్రి హైడ్రామా.. ఎంపీ అరెస్ట్



ప్రస్తుతం పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్నాయి. వీటిలో పాల్గొని ఊరికి వచ్చిన బిహార్ పూర్ణియా నియోజకవర్గ ఇండిపెండెంట్(స్వతంత్ర) ఎంపీని పాట్నా పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ విషయం ఇప్పుడు అంతటా చర్చనీయాంశమైంది. శుక్రవారం అర్ధరాత్రి దాదాపు మూడు గంటల పాటు ఎంపీ రాజేశ్ రంజన్ అలియాస్ పప్పు యాదవ్ ఇంటి దగ్గర హైడ్రామా నడిచింది. ఎట్టకేలకు పోలీసులు.. 31 ఏళ్ల క్రితం నాటి కేసులో పప్పు యాదవ్‌ని అరెస్ట్ చేశారు.

**కేసు ఏంటి?**

1995లో వినోద్ బిహారి లాల్ అనే వ్యక్తికి సంబంధించిన ఇంటిని అద్దెకు తీసుకున్న పప్పు యాదవ్.. తర్వాత దాన్ని కబ్జా చేశారనే ఆరోపణలు వచ్చాయి. దీంతో వినోద్.. అప్పట్లో పోలీసులని ఆశ్రయించారు. పప్పు యాదవ్‌పై ఫోర్జరీ, మోసం, బెదిరింపులు తదితర సెక్షన్ల ప్రకారం కేసులు నమోదు చేశారు. ఈ కేసులోనే తాజాగా కోర్టు వారెంట్ జారీ చేసింది. దీనిని తీసుకుని పోలీసులు.. శుక్రవారం రాత్రి పాట్నాలోని మందిరి ప్రాంతంలో ఉన్న పప్పు యాదవ్ ఇంటికి వచ్చారు. కానీ అరెస్ట్ చేసేందుకు మూడు గంటలకు పైగానే పట్టేసింది. 50 మంది పోలీసులు వచ్చినప్పటికీ.. పప్పు యాదవ్ అనుచరలు రంగంలోకి దిగడంతో పెద్ద హైడ్రామా నడిచింది. ఎట్టకేలకు భారీ బందోబస్తు నడుమ పప్పు యాదవ్‌ని పోలీసులు అరెస్ట్ చేశారు. వైద్య పరీక్షల చేసి అనంతరం పోలీస్ స్టేషన్‌కి తీసుకుని వెళ్లే అవకాశముంది. అయితే రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే ప్రభుత్వం తనని వేధిస్తోందని.. అరెస్ట్ సమయంలో పప్పు యాదవ్ మండిపడ్డారు.

# గోదావరి జలాలను అడ్డుపెట్టుకుని..
# తెలంగాణను కొల్లగొట్టారు

-మొదటిపేజీ తరువాయి

అడుగుతున్నా. మీ పక్కన ఉన్న కిషన్‌రెడ్డి ఎవరయ్యా? ఆయన కల్వకుంట్ల కిషన్‌రావుగా మారారు. కేసీఆర్‌కు దత్తపుత్రుడిలా వ్యవహరిస్తున్నారు. కేసీఆర్‌కు ఊడిగం చేయడం మానుకుని.. కిషన్‌రెడ్డి జనజీవన స్రవంతిలో కలవాలి.

**మనోడు కార్పొరేటరుగా గెలవాలి**


యువకులను ఒక్కటే అడుగుతున్నా. భారాస-భాజపాలకు ఓట్లు వేసి కాంగ్రెస్ నేతలను అభివృద్ధి చేయమంటే ఎలా? నేను నిధులు ఇవ్వాలంటే కౌన్సిలర్లు, కార్పొరేటర్లు మనవాళ్లు ఉండాలి కదా.. ఎమ్మెల్యేలు, మంత్రుల సహకారంతో అభివృద్ధి పనులు చేయాలంటే మనవాళ్లు ఉండాలి. మన బస్తీ కాలనీలో సౌకర్యాలు కలగాలంటే మనోడు కార్పొరేటరుగా గెలవాలి.

**అవును.. నేను రేవంతుద్దీన్‌నే..**

భాజపా అధ్యక్షుడు రామచందర్‌రావుకు చెబుతున్నా. బలహీనవర్గాల కులగణన చేయించినందుకు సంతోషంతో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ నన్ను రేవంత్‌గౌడ్ అన్నారు. ఎస్సీ వర్గీకరణ ద్వారా ఆ కులాలకు న్యాయం చేసినప్పుడు మా సహచర మంత్రి రాజనర్సింహ ఆనందంతో నన్ను రేవంత్ మాదిగ అన్నారు. మొదటిసారిగా మంత్రి వాకిటి శ్రీహరిని మంత్రివర్గంలోకి తీసుకున్నప్పుడు రేవంత్ ముదిరాజ్ అన్నారు. హైదరాబాద్‌లో సదర్ వేడుకలు నిర్వహించినందుకు నన్ను రేవంత్ యాదవ్ అని ప్రశంసించారు. మూసీ నది పరీవాహక ప్రాంతంలో స్వర్ణ దేవాలయాన్ని నిర్మిస్తుంటే.. సిక్కు సోదరులు సర్దార్ రేవంత్‌సింగ్ అన్నారు. ముస్లింలకున్న 4 శాతం రిజర్వేషన్‌ను కాపాడడంతో పాటు.. ఎమ్మెల్యే కాకున్నా అజారుద్దీన్‌ను మంత్రిని చేశాం. మేం ముస్లింల హక్కులు కాపాడుతున్నాం. ఈ కారణంగా రామచందర్‌రావు నన్ను రేవంతుద్దీన్ అన్నా.. నాకు సమస్య లేదు. అన్ని కులాలను సమన్వయం చేసుకుంటూ రాష్ట్రాన్ని నంబర్‌వన్ స్థానంలో ఉంచడానికే ప్రజలు నాకు అధికారం ఇచ్చారు.

**పదేళ్లలో కేసీఆర్ రేషన్‌కార్డులే ఇవ్వలేదు..**

పదేళ్లు అధికారంలో ఉన్న కేసీఆర్ ఒక్కసారి కూడా రేషన్‌కార్డులివ్వలేదు. మేం వచ్చాక.. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో రేషన్ కార్డులు మంజూరు చేసి.. 3.12 కోట్ల మందికి సన్నబియ్యం ఇస్తున్నాం. కేసీఆర్ దొడ్డు బియ్యం ఇస్తే లబ్ధిదారులు వాటిని బర్రెలకు పెట్టేవాళ్లు.




మా హయాంలో 50 లక్షల మంది పేదలకు 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటు ఇస్తున్నాం. మహిళలు పుట్టింటికి, రాములవారి గుడికి రూపాయి ఖర్చు లేకుండా వెళ్తున్నారు. 1000 బస్సులను మహిళలకు ఇచ్చి వారిని యజమానులను చేశాం. హైదరాబాద్‌లోని శిల్పారామంలో మహిళలు 150 దుకాణాలు ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. 70 వేల మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇచ్చాం. కేసీఆర్‌కు అనుమానం ఉంటే ఫాంహౌస్ నుంచి ఎల్బీ స్టేడియానికి వచ్చి లెక్కపెట్టుకోవచ్చు. ఉద్యోగాల లెక్కలో ఒక్క తలకాయ తగ్గినా.. నా తల తీసుకుంటా" అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

**అభివృద్ధి పనులకు శంకుస్థాపన**

అంతకు ముందు సీఎం.. మూడు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు, తెలంగాణ విశ్వవిద్యాలయంలో.. ఆడిటోరియం, పరిపాలన భవనం, ఇండోర్ స్టేడియం తదితరాలకు శంకుస్థాపన చేశారు. స్వయం సహాయక సంఘాలకు రూ.200 కోట్ల రుణాలు పంపిణీ చేశారు. ఇటీవల నిజామాబాద్‌లో గంజాయి స్మగ్లర్ల కారు దాడిలో మృతి చెందిన కానిస్టేబుల్ సౌమ్య కుటుంబసభ్యులకు, దొంగ రియాజ్ చేతిలో హత్యకు గురైన కానిస్టేబుల్ ప్రమోద్ కుటుంబసభ్యులకు రూ.కోటి చొప్పున ఎక్స్‌గ్రేషియా చెక్కులను ముఖ్యమంత్రి అందజేశారు. ఈ కార్యక్రమాల్లో ప్రభుత్వ సలహాదారులు సుదర్శన్‌రెడ్డి, షబ్బీర్ అలీ, నిజామాబాద్ గ్రామీణ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, ఆర్మూర్ భాజపా ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ నర్సారెడ్డి, ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్‌బిన్ అందాన్, డీసీసీ అధ్యక్షుడు నగేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం సీఎం నగరపాలక సంస్థ, పురపాలిక బరిలో ఉన్న అభ్యర్థులకు దిశానిర్దేశం చేశారు.

**మాది విక్టరీ జోడీ**

'2023లో పీసీసీ అధ్యక్షుడిగా నేను, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా మహేశ్‌కుమార్ పనిచేసి అధికారంలోకి వచ్చాం. 2004, 2009లలో ధర్మపురి శ్రీనివాస్ పీసీసీ అధ్యక్షుడిగా ఉండి, వైఎస్ రాజశేఖర్‌రెడ్డితో కలిసి పార్టీని అధికారంలోకి తీసుకొచ్చారు. ఆ విధంగానే 2029లో మహేశ్‌గౌడ్, నేను అధికారంలోకి తీసుకువచ్చే బాధ్యత తీసుకుంటాం' అని సీఎం తెలిపారు.


# ఇక ఆర్ఆర్ఆర్ 161 ఏఏ

హైదరాబాద్:

రీజినల్ రింగురోడ్డు ఉత్తర భాగం పనులు ప్రారంభించే దిశగా కేంద్ర ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. ఇందులో భాగంగా ఆ రోడ్డుకు జాతీయ రహదారి నంబరును కేటాయించింది. 161ఏఏ నంబరును కేటాయిస్తూ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఇప్పటికే టెండర్లు పిలిచినప్పటికీ, ఆ తర్వాత రోడ్డును నాలుగు వరుసలకే కుదించడంతోపాటు కొన్ని మార్పులు చేయటంతో అందులో జాప్యం జరిగింది. టెండర్ల ఫైనాన్షియల్ బిడ్‌ను తెరవాలంటే రోడ్డుకు జాతీయ నంబరు వచ్చి ఉండాలి. ఇప్పుడు ఆ అవాంతరం కూడా తొలగింది. దీంతో ఇక టెండర్లు ఓపెన్ చేసి పనులు ప్రారంభించటమే తరువాయి.

**ఆ రోడ్డు నంబరు దీనికి...**

ప్రస్తుతం సంగారెడ్డి నుంచి తూప్రాన్, గజ్వేల్, భువనగిరి మీదుగా చౌటుప్పల్ వరకు ఉన్న జాతీయ రహదారికి 161ఏఏ నంబరు ఉంది. రీజినల్ రింగు రోడ్డు ఉత్తర భాగం కూడా దానికి సమాంతరంగా సంగారెడ్డి నుంచి చౌటుప్పల్ వరకు నిర్మించనున్న విషయం తెలిసిందే. రీ జినల్ రింగురోడ్డు జాతీయ రహదారిగా రూపొందనున్నందున, అదే మార్గంలో మరో జాతీయ రహదారి అవసరం లేదు. దీంతో సంగారెడ్డి నుంచి చౌటుప్పల్ వరకు ఉన్న ప్ర స్తుత రోడ్డుకు జాతీయ రహదారి హోదా తొలగించి దాన్ని రాష్ట్ర ప్రభుత్వ నిర్వహణలోకి తిప్పి పంపనున్నారు. దీంతో దానికి ఉన్న 161 ఏఏ జాతీయ రహదారి నంబరును రీజి నల్ రింగురోడ్డు ఉత్తర భాగానికి కేటాయించారు. సంగారెడ్డి నుంచి చౌటుప్పల్ వరకు ఉన్న ప్రస్తుత జాతీయ రహ దారి ఇక రాష్ట్ర రహదారిగా మారుతుంది. రీజినల్ రింగురోడ్డు ప్రతిపాదన వచ్చినప్పుడు సంగారెడ్డి, చౌ టుప్పల్ రోడ్డును అందులో భాగంగా అభివృద్ధి చేయాలని భావించారు. పూర్తి కొత్త రోడ్డు(గ్రీన్‌ఫీల్డ్)గా కాకుండా బ్రౌన్‌ఫీల్డ్ రోడ్డుగానే దాన్ని నిర్మించాలన్నది తొలి ఆలో చన. తర్వాత దాన్ని ఎక్స్‌ప్రెస్‌వే స్థాయిలో నిర్మించాలని




నిర్ణయించారు. అప్పుడు అది పూర్తి యాక్సెస్ కంట్రోల్డ్ పద్ధతిలో ఉండాల్సి ఉంటుంది.
పట్టణాల మీదుగా కొన సాగుతున్న ప్రస్తుత రోడ్డు అందుకు సరిపోదు. దీంతో దాన్ని రీజినల్ రింగురోడ్డుగా మార్చాలన్న ఆలోచనను విరమించుకున్నారు. సంగారెడ్డి సమీపంలోని గిర్మాపూర్ గ్రామం వద్ద ఎన్‌హెచ్65 నుంచి ఉత్తర రింగు మొదలై, అదే ఎన్‌హెచ్65 మీదే ఉన్న చౌటుప్పల్ సమీపంలోని తంగేడుపల్లి వరకు కొనసాగుతుంది. మహారాష్ట్రలోని అకో లా నుంచి సంగారెడ్డి వరకు ఉన్న జాతీయ రహదారికి 181 నంబరు ఉంది. అక్కడి నుంచే రీజినల్ రింగురోడ్డు మొదలు కానున్నందున అదే నంబరును కొన సాగిస్తున్నారు.
సాధారణంగా ఇలాంటి అనుసంధాన రోడ్డు నంబరుకు ఏ అన్న ఆంగ్ల అక్షరాన్ని జోడిస్తారు. కానీ, ఇప్పటికే మహారాష్ట్రలోని అకోట్ నుంచి బీదర్ వరకు ఉన్న జాతీయ రహదారికి 161ఏ కొనసాగుతోంది. దీంతో కొత్త రోడ్డుకు 161ఏఏ ఖరారు చేశారు. కేంద్ర రహదారుల శాఖ అధీనంలోని జాతీయరోడ్ల వరసలో ఈ కొత్త రోడ్డు 402వదిగా గెజిట్‌లో చూపారు.

**ఈ నెలలోనే పీపీపీఏసీ భేటీ... రోడ్డు నిర్మాణానికి ఆమోదం...**

ఇప్పటికే కేంద్ర జాతీయ రహదారుల శాఖ కార్యదర్శి స్థాయిలో రీజినల్ రింగురోడ్డు ఉత్తర భాగానికి ఆమో దం లభించింది. దీనికి నిధులు విడుదల కావాలంటే, కేంద్ర ఆర్థిక శాఖ అధీనంలోని పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ అప్రైజల్ కమిటీ (పీపీపీఏసీ)ఆమోదం అసవరం. ఈ నెలాఖరుకు ఆ సమావేశం ఉంటుందని సమాచారం. రోడ్డు నంబరు కూడా కేటాయించినందున ఇక టెండర్లు తెరిచేందుకు పీపీపీఏసీ ఆమో దముద్ర వేయనుంది. దీంతో నిర్మాణ సంస్థతో ఒప్పందానికి మార్గం సుగమమవుతుంది. ఆగస్టు నుంచి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించే వీలుంది.

## నల్గొండ..ఎవరికి అండ?

నల్గొండ

నల్గొండగా మారిన నీలగిరి ఉద్యమాలకు ఊపిరి.. ధిక్కార ధ్వనులకు అస్తిత్వ ప్రతీక. 1951లో 8 వార్డులతో పురపాలక సంస్థగా ఏర్పడిన నల్గొండ క్రమక్రమంగా 48 వార్డులతో గ్రేడ్-1 పురపాలక సంఘమైంది. 2026 జనవరి 14న రాష్ట్ర ప్రభుత్వం దీన్ని నగరపాలిక సంస్థగా మార్చింది. 48 వార్డులు డివిజన్లు అయ్యాయి. తొలిసారి మేయర్ జనరల్ మహిళకు రిజర్వయింది. నల్గొండ పురపాలికకు 1953 నుంచి 2020 వరకు 13 సార్లు ఎన్నికలయ్యాయి. 8 సార్లు కాంగ్రెస్, భాజపా రెండుసార్లు, తెదేపా రెండుసార్లు, భారాస ఒకసారి ఛైర్మన్ పీఠాలు గెలుచుకున్నాయి. కాంగ్రెస్ అభ్యర్థి వెంకట నర్సింహారావు తొలి ఛైర్మన్‌గా గెలిచారు. 2020-24 వరకు మందడి సైదిరెడ్డి(భారాస) ఉండగా అతనిపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు.అప్పటి నుంచి 2024-25 వరకు బుర్రి శ్రీనివాస్‌రెడ్డి(కాంగ్రెస్) ఛైర్మన్‌గా వ్యవహరించారు. ప్రస్తుతం అతని సతీమణి బుర్రి చైతన్యరెడ్డిని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మేయర్ అభ్యర్థిగా ప్రకటించారు.

**పార్టీల బలాలు.. బలహీనతలు**

ప్రధాన పార్టీలన్నీ నల్గొండ తొలి మేయర్ పీఠంపై గురి పెట్టాయి. కాంగ్రెస్ పార్టీ ఒంటరిగా 48 డివిజన్లలో పోటీ చేస్తోంది. భారాస-47, భాజపా-45, జనసేన-9, మజ్లిస్-8, బీఎస్పీ-2, సీపీఐ(ఎం)-1, ఎఐఎఫ్‌బీ (ఫార్వర్డ్ బ్లాక్)-9, ఇతరులు -52 మంది కలిపి 221 మంది పోటీ చేస్తున్నారు.

## మూడు వారాల్లో తేల్చాల్సిందే!



-మొదటిపేజీ తరువాయి

వినిపించారు. 'అనర్హత పిటిషన్లపై విచారణ ప్రక్రియ ఇప్పటికే కొనసాగుతోంది. పెండింగ్‌లో ఉన్న మొత్తం పిటిషన్లలో ఒకదానిపై ఇప్పటికే నిర్ణయం తీసుకున్నాం. మిగిలిన రెండు పిటిషన్లు కూడా విచారణలో ఉన్నాయి. రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల హడావుడి ఉండటం వల్ల స్పీకర్ కొంత సమయం కోరాల్సి వచ్చింది. మార్చి మధ్యలోగా లేదా అంతకంటే ముందే ప్రక్రియ పూర్తి చేసే అవకాశం ఉంది..' అని చెప్పారు.

**16 నెలలుగా ఏం చేస్తున్నారు?: మోహిత్ రావ్**

సింఘ్వీ వాదనలను పిటిషనర్లు పాడి కౌశిక్ రెడ్డి, కేటీఆర్ తరఫు సీనియర్ న్యాయవాది మోహిత్‌రావ్ తీవ్రంగా వ్యతిరేకించారు. 'గత 16 నెలలుగా ఈ వ్యవహారాన్ని స్పీకర్ కార్యాలయం తొక్కిపెడుతోంది. స్పీకర్ స్వయంగా నాలుగు వారాల్లో నిర్ణయం తీసుకుంటామని గతంలో కోర్టుకు హామీ ఇచ్చి, ఇప్పటివరకు కేవలం ఒక్కసారి మాత్రమే విచారణ జరిపారు. ఒక ఎమ్మెల్యే బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచి, కాంగ్రెస్ టికెట్‌పై ఎంపీగా పోటీ చేసి ఓడిపోయారు. అయినా ఆయన ఇప్పటికీ బీఆర్ఎస్ ఎమ్మెల్యేగానే కొనసాగుతున్నారు. ఇంతకంటే నిదర్శనం ఏం కావాలి?..' అని ప్రశ్నించారు. ఇరు పక్షాల వాదనలు విన్న ధర్మాసనం..తదుపరి విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది.

**కోర్టులను రీల్స్ కోసం వాడుకోవద్దు**

విచారణ సందర్భంగాన్యాయవాద వృత్తిలోని నైతికతపై జస్టిస్ సంజయ్ కరోల్ కీలక వ్యాఖ్యలు చేశారు. కోర్టు గదుల్లో జరిగే వాదనలను రికార్డ్ చేసి సోషల్ మీడియాలో 'రీల్స్' రూపంలో పోస్ట్ చేయడంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. 'న్యాయస్థానాలను రీల్స్ కోసం వాడుకోవద్దు. ఇది ఇప్పుడు ఒక కొత్త పరిశ్రమగా మారింది. బాధ్యతాయుతమైన ఆఫీసర్లుగా ఇలాంటి వాటిని ప్రోత్సహించవద్దు..' అని హితవు పలికారు.

## కాంగ్రెస్, భారాస తోడు దొంగలు

-మొదటిపేజీ తరువాయి

తగ్గించడానికి ప్రయత్నించింది. తెలంగాణ జనాభాలో నిజమైన బీసీలు 46 శాతం ఉన్నారు. అయినప్పటికీ కాంగ్రెస్ పార్టీ 10శాతం ముస్లింలనూ బీసీలలో చేర్చి రాష్ట్ర జనాభాలో బీసీలు 56 శాతంగా పేర్కొంది. బీసీలు, ముస్లింలకు కలిపి వారు స్థానిక సంస్థల్లో 42% రిజర్వేషన్లు కేటాయించారు. దీంతో బీసీలకు ప్రస్తుతం ఉన్న 34% కోటా 32 శాతానికి తగ్గుతుంది. ఇప్పుడు మత ప్రాతిపదికన 4శాతం రిజర్వేషన్లు కల్పించి, అదనంగా 10 శాతం జోడించి, కాంగ్రెస్ ముస్లింలను బీసీ వర్గాలలోకి అక్రమంగా చొప్పించడానికి ప్రయత్నిస్తోంది. దీనివల్ల అర్హులైన బీసీలకు నష్టం వాటిల్లుతుంది. బీసీలు తమ ఓట్లతోనే కాంగ్రెస్‌కు గుణపాఠం చెబుతారు" అని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

**కాంగ్రెస్, భారాస తోడు దొంగలు**

రాష్ట్రంలో భారాస కేసీఆర్ కుటుంబ పాలన సాగిస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం సోనియా కుటుంబ పాలన సాగిస్తోందని.. ఈ రెండు పార్టీలు తోడు దొంగలని కిషన్‌రెడ్డి విమర్శించారు. రంగారెడ్డి జిల్లా ఆమనగల్లులో భాజపా నేత, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి, కౌన్సిలర్ అభ్యర్థులతో కలిసి రోడ్‌షోలో పాల్గొన్నారు. అనంతరం సభలో మాట్లాడారు. కేసీఆర్‌ను ఫాంహౌస్‌కు పంపినట్లే హామీలు నెరవేర్చని కాంగ్రెస్ పార్టీని ఓడించాలని పిలుపునిచ్చారు.

## కాంగ్రెస్ పాలనలో స్కామ్‌లే.. స్కీమ్‌లు లేవు

సిరిసిల్ల



రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో స్కామ్‌లే తప్ప.. కొత్త స్కీమ్‌లు లేవని.. ఆరు గ్యారంటీల పేరిట ప్రజలను కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. సిరిసిల్ల, వేములవాడ పట్టణాల్లో శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణకు చేస్తున్న అన్యాయాలపై విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ పార్టీ దొంగమాటలతో అధికారంలోకి వచ్చి అడ్డగోలు హామీలు ఇచ్చి పదవి ఎక్కిన తర్వాత ప్రజల్ని మోసం చేస్తుందన్నారు. వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఎన్నికల సందర్భంగా వంద రోజుల్లో అమలు చేస్తానని హామీలతో రాసిచ్చిన బాండ్‌పేపర్‌ను ప్రజలకు కేటీఆర్ చూపించారు. తనకు ఓటు వేయకుంటే చనిపోతానని, నాలుగుసార్లు ఓడిపోయానని చెప్పి సానుభూతి డైలాగులతో మభ్యపెట్టిన ఆది శ్రీనివాస్ ఆ తర్వాత హామీల అమలు నుంచి అభివృద్ధి వరకు అడ్రస్ లేకుండా పారిపోయాడన్నారు.

**కాంగ్రెస్‌కు ఓటేస్తే.. మోసాలకు మద్దతిచ్చినట్టే...**

ఒకవేళ ఇన్ని రకాల మోసాల తర్వాత, ద్రోహాల తర్వాత కూడా ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే ప్రజలకు మేము చేస్తున్నదే సరైందని, ప్రజలు కాంగ్రెస్‌కు అనుకూలంగా తీర్పు ఇస్తున్నారని రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తుందని కేటీఆర్ చెప్పారు. హామీల అమలుపై భవిష్యత్‌లోనూ దృష్టి పెట్టే అవకాశమే ఉండదని హెచ్చరించారు. కాంగ్రెస్ చెప్పిన హామీలు రూ.4 వేల పెన్షన్ నుంచి మొదలుకొని రైతు భరోసా, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ , తులం బంగారం రావాలన్నా ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా ఓటు వేయాలన్నారు.

**దేవుడి పేరు చెప్పి ఓట్లు**

పార్లమెంట్ నియోజకవర్గం నుంచి రెండుసార్లు ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర మంత్రి బండి సంజయ్ కూడా చేసిందేమీ లేదని కేటీఆర్ చెప్పారు. రూ.15 లక్షలు ప్రతి ఇంటికి ఇస్తానని చెప్పిన మోదీ ఆ తర్వాత ఇచ్చిన హామీలన్నింటినీ పక్కన పెట్టారని విమర్శించారు. ప్రతీసారి ఎన్నికలు రాగానే దేవుడి పేరు చెప్పి కులం, మతం పేరు చెప్పి బీజేపీ ఓట్లు వేయించుకుంటుందన్నారు. ఈసారి కూడా బీజేపీ దొంగమాటలకు మోసపోవద్దని కోరారు. ఈ మున్సిపల్ ఎన్నికల్లో వేసే ఓటుతో మరోసారి కేసీఆర్ తిరిగి ముఖ్యమంత్రిని చేసుకునే ప్రస్థానం ప్రారంభం కావాలన్నారు. సిరిసిల్ల, వేములవాడల్లో జరిగిన ప్రచార సభల్లో బీఆర్ఎస్ నాయకులు చల్మెడ లక్ష్మీనరసింహారావు, కొండూరి రవీందర్‌రావు, తోట ఆగయ్య, తుల ఉమ, గూడూరి ప్రవీణ్, జిందం చక్రపాణి పాల్గొన్నారు.

## సంపాదకీయం

# ఈ డీల్ భారత్‌కు ప్రయోజకరమేనా?

ప్రపంచంలోనే రెండు అతిపెద్ద ప్రజాస్వామ్య దేశాలైన భారత్- అమెరికా మధ్య నెలకొన్న వాణిజ్య ఒప్పందానికి ఎట్టకేలకు తెరపడింది. భారత్‌తో వాణిజ్య ఒప్పందాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఈ నిర్ణయంతో ఆసియా ఎగుమతి మార్కెట్‌లో చైనా, పాకిస్థాన్, బంగ్లాదేశ్‌లకు భారీ ఎదురు దెబ్బ తగిలింది. ఇన్నాళ్లు 50 శాతం టారిఫ్‌లతో ఎగుమతుల్లో అమెరికా మార్కెట్‌కు దూరంగా ఉన్న భారత్ సుంకాల తగ్గింపుతో ముందంజలోకి దూసుకు వచ్చింది. అమెరికా సవరించిన టారిఫ్‌లతో భారతీయ ఎగుమతిదారులకు ఏకంగా 32 శాతం పన్ను భారం తగ్గింది. ఇది భారత ఎగుమతులకు భారీ ఊరట అని చెప్పాలి. భారత్‌తో వాణిజ్య ఒప్పందానికి అంగీకరిస్తున్నామని అమెరికా అధ్యక్షుడు ప్రకటించిన వేళ దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం భారీ లాభాలతో ప్రారంభమయ్యాయి. గ్లోబల్ పాజిటివ్ సంకేతాలు, ముఖ్యంగా భారత్ -అమెరికా మధ్య కీలక వాణిజ్య ఒప్పందంపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన ప్రకటన ఇన్వెస్టర్లలో భారీ ఉత్సాహాన్ని నింపింది. ఫలితంగా మార్కెట్లు ఓపెనింగ్ నుంచే బుల్స్‌ల్రోకి దూసుకెళ్లాయి. బిఎస్‌ఇ సెన్సెక్స్ 2,256 పాయింట్ల లాభంతో 83,935 వద్ద ట్రేడవుతుండగా, నిఫ్టీ 699 పాయింట్లు పెరిగి 25,787 స్థాయిలో కదలాడుతోంది. ప్రీ- ఓపెనింగ్ సెషన్‌లోనే సెన్సెక్స్ 3,600 పాయింట్ల వరకూ ఎగబాకడం విశేషం. నిఫ్టీ 26,300 మార్క్‌ను తాకి రికార్డు స్థాయిని అందుకుంది. మార్కెట్ ప్రారంభం నుంచే అన్ని రంగాల్లో కొనుగోళ్లు జోరుగా కనిపించాయి. అమెరికా భారత్‌తో ట్రేడ్ డీల్‌కు అంగీకరిస్తున్నట్టు ట్రంప్ ప్రకటించడంతో పాటు, భారత్ ఉత్పత్తులపై ఉన్న ప్రతీకార సుంకాలను 50 శాతం నుంచి 18 శాతానికి తగ్గిస్తున్నట్టు వెల్లడించారు. రష్యా నుంచి చమురు కొనుగోళ్లపై విధించిన అదనపు సుంకాలు కూడా ఈ తగ్గింపులో భాగం కావడంతో భారత ఎగుమతులకు పెద్ద ఊరట లభించనుంది. ఈ నిర్ణయం భారత ఆర్థిక వ్యవస్థకు గేమ్ ఛేంజర్‌గా మారుతుందని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. భారత్ ఆసియా ఎగుమతి మార్కెట్‌లో మొదటి స్థానంలో నిలిచింది. ఎగుమతుల్లో ప్రాంతీయ ప్రత్యర్థులైన చైనా, పాకిస్థాన్, బంగ్లాదేశ్, శ్రీలంకల కంటే మెరుగైన స్థానంలో నిలిచింది. ఈ డీల్ ముందు వరకు ఆసియాలోనే భారీగా అమెరికా టారిఫ్‌లను ఎదుర్కొన్న దేశం భారత్. ఒక్క రాత్రిలో అది తలకిందులైంది. ఇప్పుడు 18 శాతంతో అతి తక్కువ సుంకాలు విధిస్తున్న దేశాల జాబితాలో టాప్‌లోకి వచ్చేసింది. ప్రస్తుతం పాకిస్థాన్‌పై 19 శాతం, శ్రీలంకపై 20 శాతం, బంగ్లాదేశ్‌పై 20 శాతం, వియత్నాంపై 20 శాతం, ఇండోనేషియా, మలేసియా, థాయ్‌లాండ్‌పై 19 శాతం చొప్పున, చైనాపై 34 శాతం సుంకాలు అమల్లోకి ఉన్నాయి. చైనాపై భారత్ కంటే దాదాపు రెట్టింపు టారిఫ్‌లు అమల్లో ఉండటం గమనార్హం. అయితే ఆసియాలో అఫ్ఘానిస్థాన్ ఒక్కటే భారత్ కంటే తక్కువ టారిఫ్‌లు 15 శాతం ఎదర్కొంటోంది. కానీ, ఆసియా ఎగుమతి మార్కెట్‌లో అఫ్ఘానిస్థాన్ భారత్‌కు ఏ మాత్రం పోటీ కాదు. టారిఫ్‌ల తగ్గింపుతో అమెరికా మార్కెట్‌లో భారతీయ ఉత్పత్తులు చవకగా లభించి, ఎగుమతులు భారీగా పెరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా ఎలక్ట్రానిక్స్, వస్త్రాలు, పాదరక్షల వంటి కీలక రంగాలలో వియత్నాం, బంగ్లాదేశ్‌లతో పోటీ పడుతున్న భారతీయ కంపెనీలకు భారీ ఊరట కలగనుంది. టెక్స్‌టైల్స్, జెమ్స్, జ్యువెలరీ, ఫార్మా రంగాలు అమెరికా మార్కెట్‌లో మరింత పోటీనిస్తాయి. సుంకాల సవరింపు తర్వాత ఆసియా ఎగుమతి మార్కెట్‌లో చైనాతో పోలిస్తే భారత్ ఇప్పుడు చాలా బలీయమైన స్థితిలో ఉంది. ఇది ప్రపంచవ్యాప్తంగా ఉన్న కంపెనీలను తమ తయారీ కేంద్రాలను చైనా నుంచి భారత్‌కు మార్చేలా ప్రోత్సహిస్తుంది. భారత్ కూడా అమెరికా ఉత్పత్తులపై ఉన్న సుంకాలను, అడ్డంకులను తొలగించి 'జీరో' స్థాయికి తీసుకెళ్లడానికి ఒప్పుకున్న నేపథ్యంలో ఇరు దేశాల వాణిజ్యం కొత్త పుంతలు తొక్కనుంది. ప్రధాని నరేంద్ర మోడీతో జరిపిన 30 నిమిషాల ఫోన్ సంభాషణ అనంతరం, భారత్ నుంచి వచ్చే ఎగుమతులపై సుంకాలను 50 శాతం నుంచి 18 శాతానికి తగ్గిస్తున్నట్లు ట్రంప్ వెల్లడించారు. గత ఏడాది కాలంగా భారత్ నుంచి అమెరికాకు వెళ్లే ఉత్పత్తులపై మొత్తం 50 శాతం వరకు సుంకాల భారం పడుతోంది. ఇందులో 25 శాతం పరస్పర సుంకాలు కాగా, రష్యా నుంచి ఆయిల్ కొంటున్నామన్న కారణంతో మరో 25 శాతం టారిఫ్‌లను అదనంగా ట్రంప్ భారత్‌పై విధించారు. అయితే తాజా డీల్‌లో భాగంగా అదనపు సుంకాలను పూర్తిగా తొలగించడమే కాకుండా పరస్పర టారిఫ్‌లను 18 శాతానికి తగ్గిస్తున్నట్లు ట్రంప్ ప్రకటించారు. కెనడా-భారత్ యురేనియం ఒప్పందం అమెరికా అధ్యక్షుడు డొనల్డ్ ట్రంప్ కెనడాపై భారీ సుంకాలను విధిస్తానని బెదిరించిన సమయంలో భారత్ -కెనడా సంబంధాలు దగ్గరగా మారుతున్నాయి. ఇటీవల కార్నీ మార్చిలో భారత్ సందర్శించవచ్చని, నవంబర్ 2025 నుండి నిలిచిపోయిన వాణిజ్య ఒప్పందంపై చర్చలు తిరిగి ప్రారంభించే అవకాశం ఉందని నివేదికలు వచ్చాయి. ముఖ్యంగా యురేనియం ఒప్పందం ద్వారా సుమారు రూ. 25,000 కోట్ల (సుమారు 25 బిలియన్ డాలర్లు ) విలువైన వ్యాపారం జరుగుతుందని సూచిస్తున్నారు. భారత్ అనేక దక్షిణ అమెరికా దేశాలతో కూడా వాణిజ్య ఒప్పందాలపై చర్చలు ప్రారంభించింది. చమురు సరఫరా కూడా కొనసాగుతోంది. ఈ పరిణామాలు అమెరికా అధ్యక్షుడి ఆందోళనను మరింత పెంచాయి. అమెరికా- చైనా మధ్య వాణిజ్య యుద్ధం కొత్తది కాదు. చైనా ఇటీవల విడుదల చేసిన ఎగుమతి గణాంకాలు, 2025 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల ఎగుమతులు సాధించగలదని చూపించాయి. అమెరికా చైనాపై అధిక సుంకాలను విధించినప్పటికీ, చైనా ప్రపంచం వివిధ దేశాలలో సుంకాలను పెంచింది. ప్రపంచ సరఫరా గొలుసులో భారత్ ప్రధాన పాత్ర పోషించగల దేశంగా ఉంది. భారత ఉత్పత్తులను పొందడం, ప్రపంచ దేశాల మద్దతు, యూరప్- భారత్ ఒప్పందం, అమెరికా కంపెనీల భారత ప్రాధాన్యతలపై దృష్టి, ఇలా కలిపి ట్రంప్ భారత్‌పై సుంకాలు తగ్గించడానికి సహకరించారని అంటున్నారు.

# మనసులను దగ్గర చేసే గులాబీ



ఫిబ్రవరి 7న జరుపుకునే గులాబీ దినోత్సవం ఆధునిక ప్రపంచంలో ప్రేమ, స్నేహం, గౌరవం, కృతజ్ఞత వంటి మానవీయ భావాల వ్యక్తీకరణకు ప్రతీకగా నిలిచిన ఒక ప్రత్యేక దినంగా మారింది. సాధారణంగా "రోజ్ డే"గా పిలువబడే ఈ రోజు వాలెంటైన్స్ వారానికి ఆరంభ సూచికగా పరిగణించ బడినా, దాని అంతరార్థం కేవలం ప్రేమికుల పరిమిత ప్రపంచంలోనే కాదు; సమాజంలోని అన్ని సంబంధాలకు సున్నితమైన భావాలను తెలియజేసే ఒక సాంస్కృతిక వేదికగా విస్తరించింది. మాటల్లో చెప్పలేని అనుభూతులను ఒక చిన్న పువ్వు ద్వారా వ్యక్తపరచడం అనేది మానవ నాగరికతలో వేల ఏళ్లుగా కొనసాగుతున్న సాంప్రదాయం. ఆ పరంపరకి ఆధునిక రూపమే గులాబీ దినోత్సవం. గులాబీ పువ్వు చరిత్ర మానవ నాగరికత చరిత్రతో సమాంతరంగా సాగింది. ప్రాచీన గ్రీకు, రోమన్ నాగరికతల్లో గులాబీ ప్రేమ, అందం, జీవశక్తి, పవిత్రతకు ప్రతీకగా భావించబడింది. గ్రీకు పురాణాల్లో ప్రేమ దేవత అఫ్రొడైటీతో గులాబీకి ఉన్న అనుబంధం దానికి ప్రత్యేకమైన ఆధ్యాత్మిక, భావోద్వేగ విలువను తెచ్చిపెట్టింది. రోమన్లు గులాబీని రహస్యాల సంకేతంగా కూడా భావించేవారు; అందుకే "సబ్ రోసా" అనే పదప్రయోగం రహస్య సంభాషణకు సూచికగా నిలిచింది. భారతీయ సంస్కృతిలో గులాబీ ఆతిథ్యం, సౌందర్యం, సానుభూతికి చిహ్నంగా మారింది. ఆలయాల అలంకరణ లోనూ, శుభకార్యాల్లోనూ, సాహిత్యంలోనూ గులాబీ స్థానం ప్రత్యేకం. సంస్కృత, తెలుగు సాహిత్యాల్లో గులాబీ సుగంధం ప్రేమానురాగాలకు రూపకంగా తరచూ వినిపిస్తుంది. విక్టోరియన్ యుగంలో పాశ్చాత్య సమాజంలో పువ్వుల ద్వారా భావాలను తెలియజేసే ఒక ప్రత్యేక సంస్కృతి ఏర్పడింది. దీనిని "ఫ్లోరియోగ్రఫీ" అని పిలిచేవారు. ప్రతి పువ్వుకీ, ప్రతి రంగుకీ ప్రత్యేకమైన అర్థాన్ని కేటాయించి భావ వ్యక్తీకరణకు వినియోగించేవారు. ఈ నేపథ్యం ఆధునిక రోజ్ డే సంస్కృతికి పునాది వేసింది. కాలక్రమేణా ప్రపంచీకరణ ప్రభావంతో ఈ సంస్కృతి ప్రపంచ దేశాలకు వ్యాపించింది. ముఖ్యంగా పట్టణీకరణ, మీడియా ప్రభావం, యువత సంస్కృతిలో వచ్చిన మార్పులతో ఫిబ్రవరి 7 గులాబీ దినోత్సవం ఒక సామాజిక వేడుకగా రూపాంతరం చెందింది. గులాబీ పువ్వుల రంగులకు ఉన్న సంకేతార్థం ఈ దినోత్సవానికి ప్రత్యేకమైన భావ పరిమళాన్ని అందిస్తుంది. ఎరుపు గులాబీ గాఢమైన ప్రేమకు ప్రతీకగా నిలిస్తే, పసుపు గులాబీ స్నేహం, ఆనందం, ఆప్యాయతను సూచిస్తుంది. తెలుపు గులాబీ పవిత్రత, నిష్కపటతకు సంకేతం. పింక్ గులాబీ గౌరవం, కృతజ్ఞతను తెలియజేస్తుంది. నారింజ రంగు గులాబీ ఉత్సాహం, ఆశయాలను సూచిస్తుంది. ఇలా ప్రతి రంగు ఒక భావోద్వేగ భాషగా పనిచేస్తూ మానవ సంబంధాల వైవిధ్యాన్ని ప్రతిబింబిస్తుంది. ఒక చిన్న పువ్వు ద్వారా సంక్లిష్టమైన భావాలను వ్యక్తపరచగల సామర్థ్యం ఈ సంస్కృతికి మూల బలం. సామాజిక కోణంలో గులాబీ దినోత్సవం యువతలో భావ వ్యక్తీకరణకు ఒక ముఖ్య వేదికగా మారింది. వేగవంతమైన జీవనశైలిలో మానవ సంబంధాలు యాంత్రికతకు లోనవుతున్న ఈ కాలంలో, ఒక చిన్న గుర్తింపుగా గులాబీ ఇవ్వడం ద్వారా మనసుల మధ్య దూరాన్ని తగ్గించే ప్రయత్నం జరుగుతోంది. కళాశాలలు, కార్యాలయాలు, సామాజిక వేదికల్లో ఈ రోజు పరస్పర గౌరవం, స్నేహాన్ని పంచుకునే సందర్భంగా మారింది. కుటుంబ సభ్యులకు, గురువులకు, సహచరులకు గులాబీ అందించడం ద్వారా కృతజ్ఞతను తెలియజేసే సంస్కృతి కూడా పెరుగుతోంది. ఆర్థిక దృక్పథంలో చూస్తే గులాబీ దినోత్సవం పుష్ప పరిశ్రమకు ఒక కీలక కాలం. ప్రపంచవ్యాప్తంగా వాలెంటైన్స్ వారంలో పుష్పాల విక్రయాలు గణనీయంగా పెరుగుతాయి. భారతదేశంలో కూడా పుష్పోత్పత్తి, సరఫరా, రిటైల్ రంగాలకు ఇది అదనపు ఆదాయాన్ని తెస్తుంది. ఉద్యానవన రంగం, ఈ-కామర్స్ వేదికలు, గిఫ్ట్ పరిశ్రమ ఈ కాలంలో చురుకుదనాన్ని ప్రదర్శిస్తాయి. ఒక సాంస్కృతిక వేడుక ఆర్థిక కార్యకలాపాలను ఎలా ప్రభావితం చేస్తుందో దీనివల్ల స్పష్టమవుతుంది. అయితే ఈ దినోత్సవంపై విమర్శాత్మక దృక్కోణాలు కూడా ఉన్నాయి. కొందరు దీనిని పాశ్చాత్య వాణిజ్య సంస్కృతికి చెందినదిగా భావిస్తూ భావోద్వేగాల వాణిజ్యీకరణగా అభివర్ణిస్తారు. ప్రేమను ఒక నిర్దిష్ట రోజుకు పరిమితం చేయడం అవసరమా అనే ప్రశ్నలు కూడా లేవనెత్త బడుతున్నాయి. కానీ మరో కోణంలో చూస్తే, ఈ రోజు భావాలను గుర్తుచేసే ఒక ప్రతీక మాత్రమే; ప్రేమ, స్నేహం వంటి విలువలు నిత్యజీవితంలో కొనసాగాల్సినవే. గులాబీ దినోత్సవం ఆ విలువలను సంబరంగా గుర్తుచేసే ఒక సందర్భం. సాంస్కృతికంగా గులాబీ దినోత్సవం ఆధునిక భారత సమాజంలో ఒక ఆసక్తికర పరిణామాన్ని సూచిస్తుంది. సంప్రదాయ విలువలు, ఆధునిక భావ వ్యక్తీకరణ మధ్య సమతుల్యతను ఇది ప్రతిబింబిస్తుంది. భారతీయ సంస్కృతిలో పుష్పాలకు ఉన్న ఆధ్యాత్మిక, సాంప్రదాయ ప్రాధాన్యం ఆధునిక ప్రేమ సంస్కృతితో కలిసిపోతూ ఒక కొత్త సామాజిక రూపాన్ని సృష్టించింది. గులాబీ పువ్వు దేవాలయాల్లో పూజా పుష్పంగా ఉంటూనే, వ్యక్తిగత భావాల ప్రతీకగా కూడా నిలుస్తోంది. సాహిత్యం, కళల్లో గులాబీ ప్రతీకాత్మక ప్రాధాన్యం విశేషమైనది. కవులు గులాబీని ప్రేమకు, సౌందర్యానికి, జీవితపు సున్నితత్వానికి రూపకంగా వర్ణించారు. గులాబీ సుగంధం మనసును పరవశింప జేసినట్లే, మంచి భావాలు మన సంబంధాలను పరిమళింప జేస్తాయని కవిత్వం సూచిస్తుంది. ఈ సాహిత్య పరంపర ఆధునిక గులాబీ దినోత్సవానికి భావాత్మక బలం అందిస్తుంది. మనోవిజ్ఞాన దృక్కోణంలో కూడా ఈ రోజు ప్రాముఖ్యత కలిగి ఉంది. భావాలను వ్యక్తపరచడం వ్యక్తిగత మానసిక ఆరోగ్యానికి దోహదం చేస్తుంది. కృతజ్ఞత, ప్రేమ, గౌరవం వంటి సానుకూల భావాలను వ్యక్తపరచడం సంబంధాలను బలపరచడమే కాకుండా వ్యక్తిలో సంతృప్తిని పెంచుతుంది. చిన్న గుర్తింపులు పెద్ద భావోద్వేగ అనుబంధాలను నిర్మిస్తాయని పరిశోధనలు సూచిస్తున్నాయి. మొత్తం మీద ఫిబ్రవరి 7 గులాబీ దినోత్సవం ఒక సాధారణ పండుగ దినం కంటే ఎక్కువ. ఇది భావోద్వేగాల సాంస్కృతిక ఉత్సవం, సంబంధాల పునరుద్ధరణకు ఒక గుర్తింపు, ప్రేమను వ్యక్తపరచే ఒక ప్రతీక. ఒక చిన్న గులాబీ పువ్వు మనసులోని మాటను ప్రపంచానికి తెలియజేసే శక్తిని కలిగి ఉందని ఈ రోజు గుర్తుచేస్తుంది. యాంత్రిక జీవనశైలిలో మనుషుల మధ్య అనుబంధాలను సజీవంగా ఉంచేందుకు ఇటువంటి సందర్భాలు అవసరమనే సందేశాన్ని గులాబీ దినోత్సవం అందిస్తుంది. ప్రేమను, స్నేహాన్ని, కృతజ్ఞతను పంచుకునే ప్రతి

# తెలుగు సాహితీ పరిశోధనా పితామహుడు




ఏదో ఒక రంగాన్ని ఎన్నుకుని అందులోనే జీవితాన్ని గడిపేవారు సామాన్యులు. కోరుకుని ఎన్నుకున్న రంగంలో నిరంతర కృషి సల్పుతూ ప్రత్యేక గుర్తింపును తెచ్చుకునే వారు అసామాన్యులు. కాలూనిన అన్ని రంగాల్లో విశేష కృషి చేస్తూ, ఆయా రంగాల్లో పరిపూర్ణతను సాధించి, నిష్ణాతులై, ఒక ప్రత్యేక స్థానాన్ని పొందేవారే మహనీయులు. తెలుగు సాహిత్య లోకంలో చివరి కోవకు చెందిన మహనీయులు, మహామహులు వేటూరి ప్రభాకరశాస్త్రి. తెలుగు సాహిత్యానికి సక్రమమైన రూపం కల్పించి, ప్రజలందరికీ అందించే ప్రయత్నంలో తమ జీవితాలను ధారపోసిన మహనీయుల్లో అగ్రగణ్యులు వేటూరి. చరిత్రలో లభ్యమవుతున్న, మొట్ట మొదటిదిగా భావించ బడిన తెలుగు పదము "నాగబు" అని కనుగొన్నది ఆయనే కావడం విశేషం. "భాష అడవి వంటిది- కవిత ఉద్యానవనం వంటిది. ఉద్యానవన పెంపు సొంపులకు అరణ్య పరిశోధన అవసరమైనట్టే సుకవితకి భాషా పరిశోధన అవసరం" అని గట్టిగా నమ్మారు. చిన్నతనంలోనే సంపాదించుకున్న "శతావధాని వేటూరి ప్రభాకరశాస్త్రి" అనే గొప్ప పేరును తృణ ప్రాయంగా త్యజించి, తన జీవితానికి అర్థం పరమార్థం అవధానం కాదని, నిరంతర పరిశోధన అని నిర్ణయించుకుని, పరిశోధనకే అంకితమైన ధన్యజీవి వేటూరి. వేటూరి ప్రభాకరశాస్త్రి (ఫిబ్రవరి 7, 1888 – ఆగష్టు 29, 1950) తెలుగు కవి, భాష పరిశోధకులు, చరిత్రకారులు, రచయిత, విమర్శకులు, రేడియో నాటక రచయిత, తెలుగు, సంస్కృత పండితులు. వేటూరి కేవలం మేధావి మాత్రమే కాదు. తెలుగు భాషా, చారిత్రక సాహిత్య నిర్మాణానికి అక్షరాలను పేర్చిన మేస్త్రీ. ఆయన రచయిత మాత్రమే కాదు. విమర్శనా వ్యాస రచనకు ఆద్యులు. పన్నెండో ఏటే పరభాషలో కవిత చేసిన అనన్య సామాన్యులు. పిన్నవయసు శతావధాని. తెలుగు లిపి ప్రాచీనతకు ఆధారంగా దొరుకుతున్న మొట్ట మొదటి తెలుగు పదం "నాగబు" గురించి వెలుగు లోనికి తెచ్చిందే వేటూరే కావడం విశేషం. తరువాత కాలంలో అది 'నాగబుద్ధి' అనే పేరులో చివరి అక్షరం మరుగై పోగా 'నాగబు' మాత్రమే శాస్త్రికి దొరికిందని పండితులు తేల్చారు. పదం ఏదయినా మన లిపి ప్రాచీనతను వెదకటానికి అది చాలా తోడ్పడిందనేది కాదన లేని వాస్తవం. ప్రభాకర శాస్త్రి 'నాగబు' తెలుగువారి చరిత్ర గురించిన కొత్త ఆలోచనలకు దోహదపడింది అనేది సత్యం. తొలిసారిగా అన్నమయ్య ఉనికిని లోకానికి చాటి చెప్పింది కూడా ఆయనే. అయిదు శతాబ్దాలకు పైగా మరుగున పడిన పదకవితా పితామహుని గురించి తెలియని పరిస్థితుల్లో అన్నమయ్య జీవితం గురించి, ఆయన రచనల గురించీ ఎన్నో విశేషాలను శాస్త్రి వెలుగులోకి తెచ్చారు. తాళ్ళపాక చిన్నన్న వ్రాసిన "అన్నమాచార్య చరిత్ర"ను పరిష్కరించి ప్రచురించారు. అన్నమాచార్య ఉత్సవాలకు శ్రీకారం చుట్టి, ఆయన పదాలకు ప్రాచుర్యం కల్పించారు. సి.పి. బ్రౌను గురించి, తొలి తెలుగు కవయిత్రి తిమ్మక్కను గురించీ ఈ తరానికి తెలియ జేసింది ఆయనే. కాలగర్భంలో కలిసి పోతున్న తెలుగు సంస్కృతీ చరిత్ర పునరుద్ధరకోసం కంకణ ధారియై, దీక్షాదక్షులై సిద్ధి పొందిన తాపసి ఆయన. ప్రభాకరశాస్త్రి, కృష్ణా జిల్లా, మోపిదేవి మండలములో కృష్ణా నది తీరమున ఉన్న పెదకళ్ళే పల్లిలో శ్రీవత్స గోత్రజులైన వేటూరి సుందరశాస్త్రి, శేషమ్మలకు 1888, ఫిబ్రవరి 7 న జన్మించారు. ప్రభాకర శాస్త్రి ప్రాథమిక విద్య స్వగ్రామము లోనే నడిచింది. తండ్రి వద్ద, మద్దూరి రామావధాని వద్ద సంస్కృతాంధ్రములను నేర్చు కొన్నారు. ఉపనయనమైన తర్వాత ప్రభాకరశాస్త్రిని ఆయన తండ్రి శాస్త్రాలు అభ్యసించడానికి చల్లపల్లిలోని అద్దేపల్లి సోమనాథ శాస్త్రి వద్ద చేర్పించారు. 16 యేళ్ల వయసులో, చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి బందరు ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయులుగా పని చేస్తున్నారని తెలిసి కొందరు సహాధ్యాయులతో కలిసి అక్కడ చేరారు. తెలుగులో తనకు తెలిసినదంతా చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రితో ముఖతః వినోద గోష్ఠిలో విని నేర్చుకున్నదేనని ప్రభాకర శాస్త్రి చెప్పుకున్నారు. తన 19వ యేట మద్రాసు చేరి వెస్లీ మిషన్ హైస్కూలులో తెలుగు పండితునిగా రెండేళ్ళ పనిచేశారు. ఆ సమయములో మద్రా సు ప్రాచ్యలిఖిత పుస్తకశాలకు వెళ్ళి అక్కడి గ్రంథాలను చదువుతుండే వారు. ప్రభాకరశాస్త్రి, తెలుగులో అనేక కావ్యాలు రచించడముతో పాటు అనువాదాలు, వివరణా గ్రంథాలు రచించారు. ఆయన ప్రాచ్యలిఖిత పుస్తకాలయ ములో అనేక తెలుగు గ్రంథాలను చారిత్రకాధారములతో సవివరముగా పరిష్కరించి ప్రకటించారు. శృంగార శ్రీనాథం, క్రీడాభిరామం, బసవ పురాణం, రంగనాథ రామాయణం, తంజావూరి ఆంధ్ర రాజుల చరిత్ర, ప్రాచీనాంధ్ర శాసనములు, శాతవాహనులు, ఇక్ష్వాకులు, రెడ్డిరాజులు, చాటుపద్య మణి మంజరి, అన్నమాచార్య కీర్తనలు, తొలి తెలుగు రచయిత్రి తిమ్మక్క, తొలి తెలుగు శాసనము... తదితరాలను ఈరోజు అందుబాటులో ఉంచడానికి వేటూరి కృషియే కారణం. తమిళ, కన్నడ భాషలతో బాగా పరిచయము ఏర్పరచుకొని, ఆండాళ్ రాసిన కొన్ని తమిళ పాశురాలను తెలుగులోకి అనువదించారు. మద్రాసు ప్రాచ్య లిఖిత పుస్తక భాండాగారంలో విస్తృత పరిశోధనలు చేశారు. అప్పటి వరకూ వెలుగులోకి రాని ఎన్నో తాళపత్రాలు, శాసనాలు, పుస్తకాలను పరిష్కరించారు. తాను ప్రచురించిన ప్రతి గ్రంథానికీ విపుల పీఠికా నిర్మాణం గావించారు. ముప్పయి సంవత్సరాలు మద్రాసులోనే ఉండి సాహితీ సరస్వతికి ఎనలేని సేవ చేశారు. శాస్త్రి సంస్కృత రూపకాలను తెలుగులోకి అనువాదం చేశారు. తెలుగు సాహితీ లోకంలో లబ్ధప్రతిష్ఠులు, పండితులు, పరిశోధకులు, ప్రాచీన వాఙ్మయ ప్రియులు అయిన వేటూరి ప్రభాకర శాస్త్రి తెలుగు దేశంలో బాల బాలికలు పాడే పాటలు, పలికే మాటలు, చెప్పుకునే కథలు కొన్నింటిని సేకరించి 'భారతి' (1930) లో 'బాలభాష' అనే పేరుతో ప్రచురించారు. ప్రభాకరశాస్త్రిని కవిగా, చరిత్ర పరిశోధకులుగా, శాసన పరిశోధకులుగా, ప్రాచీనాంధ్ర సంకలన ప్రచురణకర్తగా, సంస్కృత రూపకానువాదకర్తగా, తాళపత్ర గ్రంథ వివరణ రచయితగా, అన్నమయ్య సంకీర్తన సాహిత్యోద్ధారకులుగా, అన్నమాచార్య ఉత్సవాల ప్రథమ ప్రారంభకులుగా తెలుగు ప్రజలు చిరకాలం గుర్తుంచుకుంటారు. ఆయన తెలుగు సాహిత్యంలో చిరస్మరణీయులు, తెలుగువారికి ప్రాతఃస్మరణీయులు.

# మొబైల్ రికవరీలో రాజన్న సిరిసిల్ల జిల్లాకు జాతీయ కీర్తి

**సీఈఐఆర్ తో విశిష్ట విజయం సాధించిన జిల్లా పోలీసులు**

**78% మొబైల్ రికవరీ రేటుతో దక్షిణాది రాష్ట్రాలలో సిరిసిల్ల జిల్లా మొదటి స్థానం**

**జిల్లా పోలీసుల పనితీరును ప్రశంసించిన రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి**




**రాజన్న సిరిసిల్ల** : రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీసులు మొబైల్ ఫోన్ రికవరీలో దేశవ్యాప్తంగా గుర్తింపు సాధించి విశిష్ట ఘనతను తమ ఖాతాలో వేసుకున్నారు. సీఈఐఆర్ వ్యవస్థను సమర్థవంతంగా వినియోగిస్తూ 78 శాతం మొబైల్ రికవరీ రేటు సాధించి, దక్షిణాది రాష్ట్రాలలో ప్రథమ స్థానంలో నిలవడం జిల్లా పోలీస్ యంత్రాంగం గర్వకారణమైన విజయం సాధించారు. జిల్లాలో వివిధ సందర్భాల్లో పోగొట్టుకున్న లేదా దొంగిలించబడిన మొబైల్ ఫోన్లపై వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరిస్తూ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం డిజిటల్ ట్రాకింగ్ విధానాలు, సీ ఈ ఐ అర్ , అప్లికేషన్ను సమర్థంగా ఉపయోగించడం ద్వారా ఇప్పటివరకు మొత్తం 2,286 మొబైల్ ఫోన్లను బాధితులకు తిరిగి అందజేస్తూ 78 శాతం రికవరీ రేటు సాధించడం విశేషం. ఈ అద్భుతమైన పనితీరుతో దక్షిణాది రాష్ట్రాలన్నింటిలో రాజన్న సిరిసిల్ల జిల్లా మొదటి స్థానాన్ని సాధించింది. ఈ సందర్భంగా రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి ఐపీఎస్. జిల్లా పోలీస్ అధికారులను అభినందిస్తూ ప్రశంసలు కురిపించి, హర్షం వ్యక్తం చేశారు. మొబైల్ రికవరీలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చినందుకు భారత ప్రభుత్వ టెలికమ్యూనికేషన్స్ శాఖ న్యూ ఢిల్లీ ఆధ్వర్యంలో సౌత్ ఇండియా లెవెల్లో మొదటి స్థానం జిల్లా పోలీసులకు దక్కడం గర్వకారణం అని పేర్కొన్నారు ఈ నెల 12వ తేదీన కేరళ లోని ఎర్నాకులంలో నిర్వహించనున్న జాతీయ స్థాయి సదస్సుకు జిల్లా ఎస్పీ మహేష్ బి గితే హాజరై, సీఈ ఐఆర్, ద్వారా మొబైల్ ఫోన్ రికవరీలో అనుసరించిన ఉత్తమ విధానాలు, కార్యాచరణ వ్యూహాలు, విజయవంతమైన అనుభవాలను కాన్ఫరెన్స్లో వివరించి అవార్డును స్వీకరించనున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ గారు మాట్లాడుతూ,మొబైల్ ఫోన్ రికవరీలో ఆల్ ఇండియా స్థాయిలో గుర్తింపు రావడం, దక్షిణాది రాష్ట్రాలలో మొదటి స్థానం సాధించడం తెలంగాణ పోలీసుల పనితీరు, నిబద్ధతకు నిదర్శనం అని పేర్కొన్నారు. ఫిర్యాదులు అందిన వెంటనే బాధ్యతాయుతంగా, తక్షణ స్పందనతో వ్యవహరించడం, అఇఎఖీ వంటి ఆధునిక డిజిటల్ వ్యవస్థలను పూర్తి స్థాయిలో వినియోగించడం, సాంకేతిక నైపుణ్యంతో ట్రాకింగ్ నిర్వహించడం వల్లే ఈ స్థాయి ఫలితాలు సాధ్యమయ్యాయని తెలిపారు. ప్రజలు తమ మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నా లేదా దొంగిలించబడినా తక్షణమే పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో పాటు అఇఎఖీ పోర్టల్ సేవలను వినియోగించుకోవాలని జిల్లా ఎస్పీ సూచించారు. మొబైల్ ఫోన్ రికవరీలో విశేష ప్రతిభ కనబర్చిన ఐటీ కోర్ ఎస్.ఐ కిరణ్ కుమార్, కానిస్టేబుల్ తిరుమలేష్తో పాటు జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందిం చారు. భవిష్యత్తులో కూడా ఇదే అంకితభావం, నిబద్ధతతో పనిచేస్తూ ప్రజలకు మరింత మెరుగైన, వేగవంతమైన, పారదర్శకమైన పోలీస్ సేవలను అందించడమే తమ లక్ష్యమని జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత విస్తృతంగా వినియోగిస్తూ, ప్రజల నమ్మకాన్ని బలపరచే విధంగా పోలీస్ శాఖ ముందుకు సాగుతుందని ఎస్పీమహేష్ బి గితే.తెలిపారు

# యశోధ ఆస్పత్రిలో అరుదైన చికిత్స




**హైదరాబాద్** : సోమాజిగూడలోని యశోద హాస్పిటల్స్ వైద్యులు, 10 నెలల వయసున్న బాలుడికి సోకిన అరుదైన కంజెనిటల్ అమేగాకారియోసైటిక్ థ్రోంబోసైటోపెనియా అనే వ్యాధిని విజయవంతంగా నయం చేశారు. ఇది వంశపారం పర్యంగా వచ్చే బోన్మారో సమస్య. దీనివల్ల రక్తంలో ప్లేట్లెట్స్ గణనీయంగా తగ్గిపోయి, ప్రాణాంతక రక్తస్రావం జరిగుతూ ఉంటుంది. దీనికి ఏకైక శాశ్వత పరిష్కారం హెమటోపోయిటిక్ స్టెమ్ సెల్ ట్రాన్స్ప్లాంటేషన్. అరుదైన ఈ చికిత్సను ఈ బాలుడికి విజయవంతంగా నిర్వహించారు యశోద హాస్పిటల్స్ వైద్యులు. ప్లేట్లెట్స్ కౌంట్ నిరంతరంగా తక్కువగా ఉండటంతో ఆ బాలుడిని యశోద హాస్పిటల్కు తీసుకువచ్చారు. సమగ్ర క్లినికల్, ల్యాబొరేటరీ పరీక్షల తర్వాత వ్యాధిగా నిర్ధారించారు. ఆ బాలుడి గ్రూప్నకు పూర్తిగా సరిపోయే దాత దొరకకపోవడంతో మరో సమస్య ఎదురైంది. అయితే బాలుడి తండ్రిని హాప్లో ఐడెంటికల్ స్టెమ్ సెల్ దాతగా ఎంపిక చేసి, ఆలస్యం చేయకుండా ట్రాన్స్ప్లాంట్ ప్రక్రియను పూర్తి చేశారు. ట్రాన్స్ప్లాంట్ తర్వాత ఆసుపత్రిలో ఉన్న సమయంలో, ఆహారం తింటున్నప్పుడు అవి శ్వాసనాళంలోకి వెళ్లడంతో మరో సమస్య ఎదురైంది. బాలుడికి అకస్మాత్తుగా శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఏర్పడింది. ఆక్సిజన్ తగ్గడం, గుండె వేగం తగ్గడం వంటి సమస్యలు తలెత్తాయి. వెంటనే పీడియాట్రిక్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్లో చేర్చి, నాలుగు రోజుల పాటు మెకానికల్ వెంటిలేషన్ అందించారు. వైద్యుల నిరంతర పర్యవేక్షణతో బాలుడు పూర్తిగా కోలుకున్నాడు. ప్రస్తుతం బాలుడి రక్తంలో ప్లేట్లెట్ కౌంట్స్ మెరుగుపడ్డాయి. ప్లేట్లెట్ ట్రాన్స్ఫ్యూషన్ అవసరం లేకుండానే బాలుడి ఆరోగ్యం నిలకడగా ఉంది. దీంతో ఆపరేషన్ విజయవంతమైందని వైద్యులు ప్రకటించారు. సోమాజిగూడ యశోద హాస్పిటల్స్ డాక్టర్, సీనియర్ కన్సల్టెంట్ హెమటో-ఆంకాలజీ, ఃఓ ఫిజీషియన్ కరణం అశోక్ కుమార్ ఈ కేసు గురించి మాట్లాడుతూ " కంజెనిటల్ అమెగాకారియోసైటిక్ థ్రోంబోసైటోపెనియా అనేది చాలా అరుదైన, తీవ్రమైన వ్యాధి. సకాలంలో స్పందించకపోతే ఇది ప్రాణాంతకం కావచ్చు. స్టెమ్ సెల్ ట్రాన్స్ప్లాంటేషన్ దీనికి ఏకైక పరిష్కారం. ఈ కేసు ద్వారా ప్రారంభ దశలోనే వ్యాధిని గుర్తించడం, అత్యాధునిక సౌకర్యాలు అందుబాటులో ఉండటం ఎంత ముఖ్యమో అర్థమవుతుంది, మల్టీడిసిప్లినరీ కేర్తో, పీడియాట్రిక్ బ్లడ్ డిజార్డర్స్కి కూడా విజయవంతంగా చికిత్స చేయవచ్చు" అని తెలిపారు. ఈ చికిత్స విజయవంతం కావడంలో యశోద హాస్పిటల్స్ హెమటాలజీ & ట్రాన్స్ప్లాంటేషన్, పీడియాట్రిక్స్, ట్రాన్స్ఫ్యూషన్ మెడిసిన్, క్రిటికల్ కేర్, నర్సింగ్, హాస్పిటల్ మేనేజ్మెంట్ విభాగాలకు తల్లిదండురుల కృతజ్ఞత చెప్పారు. గతంలో ప్రాణాంతకమని భావించిన అనేక రకాల పీడియాట్రిక్ బ్లడ్ డిజార్డర్స్, నేడు ఆధునిక వైద్య పురోగతి వల్ల నయం చేయవచ్చని ఈ కేసు నిరూపిస్తోంది. అయితే, వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించడం, సరైన చికిత్స అందించడం అత్యంత కీలకమని గుర్తుచేస్తోంది.

# బీఆర్ఎస్ బీసి వ్యతిరేక పార్టీ



**హైదరాబాద్** : బీఆర్ఎస్పై కవిత మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆ పార్టీ బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకమని అధికారికంగా ప్రకటించారని అభిప్రాయపడ్డారు. బీసీ రిజర్వేషన్లు వ్యతిరేకిస్తూ పోరాటం చేస్తున్న వారి నోటి కాడ ముద్ద లాక్కున్న బుట్టంగారి మాధవ రెడ్డికి టికెట్ ఇవ్వడంతో స్పష్టమైందన్నారు. ఆయనకు మున్సిపల్ ఎన్నికల బరిలో నిలబెట్టి తాము బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకమని బీఆర్ఎస్ రాజముద్ర వేసి చెప్పిందన్నారు. అలా కాదనుకుంటే ఆ పార్టీ ప్రజలకు వివరణ ఇవ్వాల్సిన బాధ్యత ఉందని డిమాండ్ చేశారు. తెలంగాణ జాగృతి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కీలక విషయాలు వెల్లడించారు. బీసీలకు విద్య, ఉపాధి, రాజకీయాల్లో 42 శాతం రిజర్వేషన్ల కోసం జాగృతి సహా బీసీ సంఘాలన్నీ పోరాటం చేస్తున్నాయని గుర్తు చేశారు. ఎన్నో రోజులు పోరాటం చేసి, ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి 42 శాతం రిజర్వేషన్ల బిల్లు వచ్చేలా చేశామని వివరించారు. కానీ బుట్టంగారి మాధవ్ రెడ్డి సహా మరొక వ్యక్తి దీనిపై పిటిషన్ వేశారని గుర్తు చేశారు. అలాంటి వ్యక్తికి ఇప్పుడు బీఆర్ఎస్ టికెట్ ఇచ్చిందని మండిపడ్డారు. అంటే ఈ కేసును బీఆర్ఎస్ వేయించిందా? బీసీల రిజర్వేషన్లకు బీఆర్ఎస్ వ్యతిరేకమా? అని ప్రశ్నించారు. ఈ మాధవ్ రెడ్డి అనే వ్యక్తి హరీష్ రావుకి చాలా దగ్గర వ్యక్తి అని తెలిపారు. హరీష్ రావు పర్సనల్ లాయర్ ఈ కేసు వేయించారని ఆరోపించారు. అప్పుడు దీని వెనుక ఉన్నది హరీష్ మాత్రమే అని విమర్శించారు. కానీ ఇప్పుడు బీఆర్ఎస్ ఆయనకు టికెట్ ఇవ్వటం కారణంగా దీని వెనుక బీఆర్ఎస్ మొత్తం ఉన్నట్లు అర్థమవుతోందన్నారు. తెలంగాణలో 56 శాతం ఉన్న బీసీల నోటికాడి బుక్క గుంజుకునే ప్రయత్నం చేసిన వ్యక్తికి టికెట్ ఎలా ఇస్తారని నిలదీశారు. బీఆర్ఎస్ అసలు బీసీల విషయంలో చిత్తశుద్ధితో లేదని ధ్వజమెత్తారు కవిత. పార్టీ పరంగా కూడా వాళ్లు మీటింగ్ పెట్టలేదన్నారు. బీసీ ప్రజాప్రతినిధుల ఫోరమ్ పేరుతో మాత్రమే మీటింగ్లు పెట్టారని తెలిపారు. జనగణనన విషయంలో కూడా ముందు కన్ఫ్యూజ్ చేశారని, తర్వాత మళ్లీ జనగణన చేయాలంటూ డిమాండ్ చేశారన్నారు. బీసీల రిజర్వేషన్ల విషయంలో అంతా రోడ్లపైకి వస్తే కానీ వాళ్ల మీటింగ్ లు కార్యరూపం దాల్చలేదిని వివరించారు. అందుకే బీసీలంతా కూడా బీఆర్ఎస్ పార్టీ వైఖరిని గమనించాలని కవిత విజ్ఞప్తి చేశారు. బుట్టంగారి మాధవ్ రెడ్డిని నాయకుడిని చేసింది జాగృతియేనని తెలిపారు. హరీష్ రావు ఆయనను తప్పుదోవ పట్టించి కేసు వేయించారని ఆరోపించారు. బీఆర్ఎస్ పరిస్థితి ఇలా ఉంటే కాంగ్రెస్ పార్టీ కూడా తక్కువ తినలేదని చెప్పుకొచ్చారు కవిత. బీఆర్ఎస్ పార్టీ గుర్తుపై గెలిచిన వారికి మునిసిపల్ ఎన్నికలకు ఇన్ఛార్జ్లు నియమించారని ఎద్దేవా చేశారు. ఎమ్మెల్యే అరికపూడి గాంధీని నిజామాబాద్ కాంగ్రెస్ ఇంఛార్జ్ గా చేస్తే, ప్రకాశ్ గౌడ్, తెల్లం వెంకట్ రావును కూడా తమ పార్టీ ఇన్ఛార్జ్ల జాబితాలో చోటు కల్పించారని అన్నారు. వీళ్లంతా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలని స్పీకర్ ప్రకటిస్తే ఇప్పుడు కాంగ్రెస్ మాత్రం అందుకు భిన్నంగా నవ్విపోదురుగాక నాకేటీ సిగ్గు అన్నట్లుగా ఎన్నికల బాధ్యతలు అప్పగించిందని మండిపడ్డారు. రాహుల్ గాంధీ రాజ్యాంగాలు పట్టుకొని తిరగడం కాదని, కాంగ్రెస్లో ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్లో చేరిన ఎమ్మెల్యేలపై వేటు వేయాలని సూచించారు. ఇప్పటి వరకు పాలన చూసిన ప్రజలంతా తమతో కలిసి వస్తున్నారని కవిత అన్నారు. కొన్ని పార్టీలు కలిసి వచ్చాయని తెలిపారు. అందులో భాగంగానే మున్సిపల్ ఎన్నికల్లో జాగృతి తరపున సింహం గుర్తుపై కొందరు పోటీ చేస్తున్నారని వెల్లడించారు. ప్రశ్నించే తమలాంటి వాళ్లతోపాటు సీపీఎం, న్యూ డెమాక్రసీ, స్వతంత్ర అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను కోరుతున్నారని వివరించారు. తెలంగాణ ఉద్యమ కారుల ఆత్మగౌరవ సభను ఈ నెల 12 న నిర్వహిస్తున్నామని, ఈ సభకు ఉద్యమకారులు, అమరుల కుటుంబ సభ్యులు, తెలంగాణ వాదులు హాజరుకావాలని ఆహ్వానించారు.

# 23వ వార్డ్ సమస్యలు పరిష్కరిస్తా ఆశీర్వదించండి

**కమలం గుర్తుకు ఓటు వేసి గెలిపించండి.**

**తెలుగుఆంజనేయులు**

**వనపర్తి** : 23వ వార్డులోని భారతీయ జనతా పార్టీ బలపరిచిన అభ్యర్థి ఉందే కోటి.తెలుగు ఆంజనేయులు 23 వ వార్డు అభివృద్ధి చేయడానికి ముందంజలో నేనుంటా ప్రజలు గెలిపించి ఆశీస్సులు ఇవ్వాలని కోరుతూ ఈరోజు స్వతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థి దయానంద ముదిరాజు మద్దతు తెలియజేయడం జరిగింది.వనపర్తి పట్టణం వనపర్తి జిల్లాలో బిజెపి అభ్యర్థి తెలుగు ఆంజనేయులు ఇంటింటికి ప్రచారం చేస్తూ అభివృద్ధి చేస్తాను సమస్యలు పరిష్కరిస్తాను కమలం గుర్తుకు ఓటెయ్యం డి ప్రజలను కలుస్తూ వారి సమస్యలు తెలుసుకుంటూ ఓటేయండి అని ప్రచారం చేస్తూ అందరి అభ్యర్థులు కన్నా ముందడుగులో ఉన్నాడు 23వ వార్డు అభివృద్ధి నా లక్ష్యం కమలం గుర్తుకు ఓటు వేసి గెలిపించండి.ఈ కార్యక్రమంలో వాకిటి సుదర్శన్ వార్డు ఇంచార్జ్,బిజెపి సీనియర్ నాయకులు మల్లెల శ్రీనివాసులు ,సీనియర్ నాయకులు సంద వెంకటేష్, ఉందే కోటి వెంకటేష్, ఈశ్వర్ గౌడ్, నాగరాజు ,చంద్రశేఖర్, నాగన్న, మహిళలు చంద్రమ్మ, కృష్ణవేణి, నాగమణి, కౌసల్య, కవిత, సుమిత్రమ్మ మాజీ కౌన్సిలర్, నాగలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



## హుస్నాబాద్లో అభివృద్ధి జరగాలంటే కారు గుర్తుకు ఓటు వేయండి

**మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్**







**హుస్నాబాద్** : హుస్నాబాద్ పట్టణంలో అభివృద్ధి పరుగు లెత్తాలంటే టిఆర్ఎస్ అభ్యర్థుల కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఎమ్మెల్సీ తక్కల్లపల్లి రవీందర్ రావు, మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం హుస్నాబాద్ పట్టణంలోని 6, 7, 8, 18, 19 వార్డుల్లో ఇంటింటికి తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒకసారి కాంగ్రెస్ పార్టీని నమ్మి దేవుడు లాంటి కెసిఆర్ ను దూరం చేసుకున్నామని, మరోసారి వాళ్ళ గారడి మాటలు నమ్మి మోసపోవద్దని ఓటర్లకు పిలుపునిచ్చారు. గారడీ మాటలు, మోసం చేయడంలో అక్కడ సీఎం రేవంత్ రెడ్డి ఇక్కడ మంత్రి పొన్నం ప్రభాకర్ ముందుంటారని అన్నారు. ఆరు గ్యారెంటీలను వంద రోజుల్లో అమలు చేస్తామని అధికారంలోకి వచ్చాక మొండిచూయి చూపించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వాన్ని దేని అన్నారు. బాగా అభివృద్ధి చేస్తే పొన్నం ఇంటింటికి తిరిగి ఓట్లు ఎందుకు అడుగుతున్నాడని ప్రశ్నించారు. అభివృద్ధి జరిగితే ప్రజలే ఓట్లే వేస్తారు కదా అని అన్నారు. మంత్రి పొన్నంకు మాటలు తప్ప పనులు చేయడం చేతకాదు అన్నారు. ఎదుటివాళ్లను బురిడీ కొట్టించి ప్రయోజనం పొందడమే ఆయన లక్ష్యం అని విమర్శించారు. మున్సిపల్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి మాటతప్పిన కాంగ్రెస్కు బుద్ధి చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఓట్ల కోసం వచ్చే కాంగ్రెస్ నాయకులను నెలకు రూ.2500లు, తులం బంగారం,స్కూటీల గురించి అడిగి నిలదీయాలని అన్నారు. హుస్నాబాద్ పట్టణంలో బీఆర్ఎస్ అభ్యర్థులు గెలిచి మున్సిపల్ను కైవసం చేసుకుంటే రాష్ట్ర ప్రభుత్వంతో కొట్లాడి ప్రజల సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారు. మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ను కొట్టే దెబ్బకు 6 గ్యారంటీలు మొత్తం అమలు కావాలన్నారు. మంత్రి పొన్నం చెప్పే అబద్ధాల కోరు మాటలను నమ్మి మోసపోవద్దని బిఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించి హుస్నాబాద్ అభివృద్ధికి బాటలు వేయాలని వారు ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా వార్డుల అభ్యర్థులు, స్థానిక బీఆర్ఎస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## మున్సిపల్ పోరులో హామీల బాండ్ పేపర్

**సొంత డబ్బుతో సంక్షేమ పథకాలకు అభ్యర్థి హామీ**

**పెళ్లికి రూ.25 వేలు, ఆడపిల్ల పుడితే రూ.10 వేలు అందిస్తానని వెల్లడి**

**బాండ్ పేపర్ తో ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం**

**హైదరాబాద్** : తెలంగాణలో మున్సిపల్ పోరు రసవత్తరంగా మారింది. ఇప్పటికే నామినేషన్ల ప్రక్రియ ముగియగా.. బరిలో నిలిచిన అభ్యర్థులు ఓటర్లను ఆకట్టుకోవడానికి వినూత్నంగా ప్రచారం చేస్తున్నారు. కార్పొరేటర్ గా గెలిపిస్తే ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ ప్రజాసేవ చేస్తామని హామీ ఇస్తున్నారు. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మున్సిపల్ పోరులో నిలిచిన ఓ అభ్యర్థి తనను గెలిపిస్తే సొంత డబ్బుతో సంక్షేమ కార్యక్రమాలు చేపడతానని హామీ ఇచ్చారు. తన హామీలను బాండ్ పేపర్ పై రాసిచ్చారు. ఆ బాండ్ పేపర్ తో ఇంటింటికీ తిరుగుతూ తనకు ఓటేయాలంటూ ప్రచారం చేస్తున్నారు. సుల్తానాబాద్ మున్సిపాలిటీ 9వ వార్డు నుంచి ఆల్ ఇండియా ఫ్వార్వార్డ్ బ్లాక్ పార్టీ తరఫున గొట్టం మహేశ్ పోటీ చేస్తున్నారు. తనను గెలిపిస్తే చేపట్టబోయే పనులు, వార్డు ప్రజల సంక్షేమం కోసం అమలు చేయబోయే పథకాలను మహేశ్ ఓ బాండ్ పేపర్ పై రాసి మరీ విడుదల చేశారు. వార్డులో పెళ్లి చేసుకునే యువతులకు రూ.25,016 కానుక, ఆడపిల్ల పుడితే రూ.10,016, మగ పిల్లాడు పుడితే రూ.5,016 అందిస్తానని చెప్పారు. ఈ హామీలను అమలు చేయలేకపోతే కౌన్సిలర్ పదవికి రాజీనామా చేస్తానని బాండ్ పేపర్ లో పేర్కొన్నారు.

## మీట్ యూవర్ సీపీ కార్యక్రమాన్ని ప్రారంభించిన సజ్జనార్

**హైదరాబాద్** : ప్రజలకు, పోలీసులకు మధ్య సంబంధాలు బలోపేతం చేసే దిశగా హైదరాబాద్ నగర పోలీసులు మరో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. నగరవాసులు తమ సమస్యలు, ఫిర్యాదులు, సూచనలను నేరుగా కమిషనర్కే తెలియజేసేందుకు వీలుగా 'మీట్ యువర్ సీపీ' కార్యక్రమాన్ని ప్రారంభించారు. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ ఈ కొత్త కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారు. దీని ద్వారా ఎలాంటి ముందస్తు అపాయింట్మెంట్ అవసరం లేకుండానే ప్రజలు ఆయన్ను కలిసి తమ గోడు వెళ్లబోసుకోవచ్చు. ప్రతిరోజూ మధ్యాహ్నం 2 గంటల నుంచి బంజారాహిల్స్లోని తెలంగాణ ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్లో ఉన్న పోలీస్ ప్రధాన కార్యాలయంలో కమిషనర్ ప్రజలకు అందుబాటులో ఉంటారు. ముఖ్యంగా, పాతబస్తీ వాసులు సుదూరం ప్రయాణించాల్సిన అవసరం లేకుండా, వారి సౌకర్యార్థం ప్రతి శుక్రవారం పురానీ హవేలీలోని కోత్వాల్ హౌస్లో ప్రత్యేకంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.'మీట్ యువర్ సీపీ' కార్యక్రమం గురించి కమిషనర్ సజ్జనార్ తన 'ఎక్స్' ఖాతా ద్వారా ఒక వీడియోను పంచుకున్నారు

## రేవంత్ నా నోరు నొక్కేస్తున్నారు



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు, పార్టీ మారిన ఎమ్మెల్యేలను రాళ్లతో కొట్టమని చెప్పారని, కానీ ఇప్పుడు నేను ఓట్లతో కొడదామని చెబుతున్నానని కాంగ్రెస్ పార్టీ జగిత్యాల సీనియర్ నాయకుడు జీవన్ రెడ్డి అన్నారు. గత ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి పోటీ చేసిన సంజయ్ కుమార్ ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు వార్తలు వచ్చాయి. అయితే తాను అధికార పార్టీలో చేరలేదని, అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వంతో కలిసి పని చేస్తున్నానని వివరణ ఇచ్చారు. నాటి నుంచి జీవన్ రెడ్డి అలక బూనారు. జగిత్యాల మున్సిపల్ ఎన్నికల్లోనూ సంజయ్ వర్గానికి ముప్పై సీట్లు, తన వర్గానికి 20 సీట్లు మాత్రమే ఇచ్చారని జీవన్ రెడ్డి ఆరోపించారు. ఈ క్రమంలో జీవన్ రెడ్డి వర్గానికి చెందిన పలువురు నాయకులు స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేస్తున్నారు. వారి తరపున ఆయన ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తాను బీఆర్ఎస్ పార్టీలోనే ఉన్నానని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ నిన్న చెప్పారని, అలాంటప్పుడు ఆయన అదే పార్టీలో ఉండాలని, కాంగ్రెస్లోకి ఎందుకు వచ్చారని ప్రశ్నించారు. ఎమ్మెల్యే, ఆయన పార్టీని చక్కదిద్దుకోవాలి తప్ప తన పార్టీలో చిచ్చు పెట్టవద్దని సూచించారు. ఇన్నాళ్లు తాను పార్టీ జెండాను మోస్తే ఇప్పుడు వచ్చి ఆయన తన్నుకుపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు నా గొంతు కోద్దామని చూస్తున్నారని, తన గొంతు కోయాలంటే తన కార్యకర్తలను దాటి రావాలని అన్నారు. జీవితం అయిపోయే ముందు తనకు దుఃఖం తెప్పించారని ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే రేవంత్ రెడ్డి రాళ్లతో కొట్టమని చెప్పినప్పటికీ మనం ఓటు అనే ఆయుధంతో కొడదామని అన్నారు. చేయి గుర్తును తన్నుకుపోయారని అన్నారు.



# స్ట్రాబెర్రీలతో కలిగే ఆరోగ్య ప్రయోజనాలు

చూడగానే నోరూరించే రంగు, తింటే తీపి మరి పులుపు కలగలిసిన అద్భుతమైన రుచి.. ఇవే ఈ పండు ప్రత్యేకత. ప్రకృతి మనకు ప్రసాదించిన అత్యంత అందమైన పండ్లలో ఇది ఒకటి. అయితే ఇది కేవలం రుచికి మాత్రమే పరిమితం అనుకుంటే పొరపాటే. స్ట్రాబెర్రీలలో దాగి ఉన్న ఆరోగ్య రహస్యాలు తెలిస్తే మీరు ఆశ్చర్యపోవడం ఖాయం. గుండె ఆరోగ్యం నుంచి మెరిసే చర్మం వరకు, బరువు తగ్గడం నుంచి మానసిక ఒత్తిడిని దూరం చేయడం వరకు ఈ చిన్న పండు చేసే మేలు అంతా ఇంతా కాదు. చాలామంది దీనిని కేవలం ఐస్ క్రీములు లేదా కేకుల్లో అలంకరణ కోసం వాడుతుంటారు. కానీ ప్రతిరోజూ దీనిని ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల మీ శరీరంలో ఎలాంటి మార్పులు వస్తాయో, మీ దంతాలు ముత్యాల్లా ఎలా మారుతాయో ఇప్పుడు వివరంగా తెలుసుకుందాం. ఆ ఎర్రని పండు అందించే అద్భుత ప్రయోజనాలు ఇవే. స్ట్రాబెర్రీలలో విటమిన్ ఇ, పొటాషియం, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరంలోని రోగనిరోధక శక్తిని పెంచి, వివిధ రకాల ఇన్ఫెక్షన్ల నుండి రక్షణ కల్పిస్తాయి. ముఖ్యంగా మెదడుకు రక్తప్రసరణను మెరుగుపరచడంలో ఇవి కీలక పాత్ర పోషిస్తాయి. దీనివల్ల మెదడు చురుగ్గా పనిచేయడమే కాకుండా ఏకాగ్రత కూడా పెరుగుతుంది. రక్తపోటును నియంత్రించడంలో, శరీరంలోని చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో స్ట్రాబెర్రీలు అద్భుతంగా పనిచేస్తాయి. గుండె సంబంధిత సమస్యలతో బాధపడేవారికి ఇవి ఒక గొప్ప ఔషధంలా తోడ్పడతాయి. బరువు తగ్గాలనుకునే వారికి..ప్రస్తుత కాలంలో బరువు తగ్గడం అనేది ఒక పెద్ద సవాలుగా మారింది. అలాంటి వారికి స్ట్రాబెర్రీలు ఒక మంచి ఎంపిక. వీటిలో క్యాలరీలు చాలా తక్కువగా ఉంటాయి, అదే సమయంలో ఫైబర్ (పీచు పదార్థం) ఎక్కువగా ఉంటుంది. దీనివల్ల కొద్దిగా తిన్నా కడుపు నిండిన భావన కలుగుతుంది, తద్వారా అతిగా తినడం తగ్గుతుంది. వయస్సుతో పాటు వచ్చే కంటి సమస్యలను, చూపు మందగించడాన్ని నివారించడంలో కూడా స్ట్రాబెర్రీలు సహాయపడతాయి. కంటి చూపును మెరుగుపరచడానికి అవసరమైన పోషకాలు ఈ పండులో సమృద్ధిగా లభిస్తాయి. మెరిసే చర్మం.. స్ట్రాబెర్రీలు కేవలం ఆరోగ్యానికే కాదు, సౌందర్యానికి కూడా ఎంతో మేలు చేస్తాయి. అందుకే అనేక సౌందర్య సాధనాల్లో స్ట్రాబెర్రీ గుజ్జును ఉపయోగిస్తారు. ఈ గుజ్జును ముఖానికి ప్యాక్‌లా వేసుకోవడం వల్ల చర్మం కాంతివంతంగా మారుతుంది. ఇందులోని 'ఎల్లాజిక్ యాసిడ్' చర్మంపై ముడతలు పడకుండా కాపాడుతుంది. వయస్సు పెరిగినా యవ్వనంగా కనిపించాలనుకునే వారు స్ట్రాబెర్రీని డైట్‌లో చేర్చుకోవాలి. చర్మ కణాలను పునరుజ్జీవింపజేసి, సహజసిద్ధమైన మెరుపును అందించడంలో దీనికి సాటి లేదు. ఒత్తిడి నుంచి ఉపశమనం.. చాలామంది దంతాలపై ఉండే పసుపు రంగు మరకల వల్ల ఇబ్బంది పడుతుంటారు. స్ట్రాబెర్రీలలో ఉండే 'మాలిక్ యాసిడ్' ఈ మరకలను తొలగించి, దంతాలను తెల్లగా మార్చడంలో సహాయపడుతుంది. అలాగే నేటి ఉరుకుల పరుగుల జీవితంలో ఒత్తిడి అనేది సర్వసాధారణం అయిపోయింది. స్ట్రాబెర్రీలలో ఉండే విటమిన్ సి శరీరంలో ఒత్తిడికి కారణమయ్యే 'కార్టిసాల్' అనే హార్మోన్ స్థాయిని తగ్గిస్తుంది. దీనివల్ల మనసు ప్రశాంతంగా మారుతుంది. అలసటను దూరం చేసి శరీరానికి తక్షణ శక్తిని అందించడంలో స్ట్రాబెర్రీలు ఎంతగానో తోడ్పడతాయి.

# బ్లడ్ షుగర్ కంట్రోల్‌కు కొత్త ట్రిక్!



రోజుకు ఒక్కసారి వ్యాయామం కంటే రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచుకుని ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతిరోజూ నడవాలని మనందరికీ తెలిసిన విషయమే. ముఖ్యంగా భోజనం చేసిన తర్వాత కాసేపు నడవడం వల్ల గ్లూకోజ్ స్థాయిలు అదుపులో ఉంటాయని వైద్యులు కూడా చెబుతుంటారు. తాజాగా వెలువడిన ఒక పరిశోధన మన పాత నమ్మకాలను సవాలు చేస్తోంది. రోజంతా కూర్చుని పని చేసే వారికి కేవలం ఒక్క అరగంట నడక కంటే.. మధ్య మధ్యలో చేసే ఒక చిన్న కదలిక అద్భుతమైన ఫలితాలను ఇస్తుందని ఈ అధ్యయనం తేల్చి చెప్పింది. ఏడు ఎనిమిది గంటల పాటు కుర్చీకే పరిమితం అయ్యేవారు తమ రక్తంలోని చక్కెర స్థాయిలను అదుపులో ఉంచుకోవడానికి జిమ్‌కు వెళ్లాల్సిన పనిలేదు, కిలోమీటర్ల కొద్దీ నడవాల్సిన అవసరం లేదు. కేవలం కొన్ని సెకన్ల పాటు చేసే ఆ వ్యాయామం మీ మెటబాలిజంను, మెదడు ఆరోగ్యాన్ని పూర్తిగా మార్చేస్తుంది. ఇంతకీ నడక కంటే శక్తివంతమైన ఆ వ్యాయామం ఏంటి? నిపుణులు సూచిస్తున్న ఆ 'ఎక్సర్‌సైజ్ స్నాక్స్' రహస్యం ఏంటో . స్క్వాట్స్ ఎందుకు.. న్యూయార్క్ టైమ్స్ బెస్ట్ సెల్లింగ్ రచయిత, ప్రముఖ ఇంటర్నల్ మెడిసిన్ ఫిజీషియన్ డాక్టర్ ఆస్టిన్ పెర్ల్‌ముట్టర్ తాజాగా ఒక ఆసక్తికరమైన అధ్యయనాన్ని సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. అధిక బరువు ఉన్న పురుషులపై జరిపిన ఈ పరిశోధనలో.. రోజులో ఒకసారి సుదీర్ఘంగా నడవడం కంటే, రోజంతా చిన్న చిన్న విరామాలలో బాడీ వెయిట్ స్క్వాట్స్(గుంజీలు) చేయడం వల్ల బ్లడ్ షుగర్ లెవల్స్ చాలా మెరుగ్గా అదుపులోకి వచ్చాయని తేలింది. ముఖ్యంగా గ్లూకోజ్ స్పైక్స్ పెరగకుండా నిరోధించడంలో స్క్వాట్స్ కీలక పాత్ర పోషిస్తున్నాయని ఆయన వివరించారు. ఈ అధ్యయనం కోసం పాల్గొన్న వ్యక్తులను నాలుగు గ్రూపులుగా విభజించారు. సుమారు 8.5 గంటల పాటు వారు కూర్చుని ఉన్న సమయంలో.. ఒక గ్రూపు వారు అసలు కదలలేదు. రెండో గ్రూపు వారు ఒకేసారి 30 నిమిషాల పాటు నడిచారు. మూడో గ్రూపు వారు ప్రతి 45 నిమిషాలకు ఒకసారి మూడు నిమిషాల పాటు నడిచారు. ఇక నాలుగో గ్రూపు వారు ప్రతి 45 నిమిషాలకు ఒకసారి కేవలం పది స్క్వాట్స్ మాత్రమే చేశారు. ఈ నాలుగు గ్రూపుల రక్త నమూనాలను పరిశీలించగా.. రోజంతా ఒకేసారి నడిచిన వారి కంటే, మధ్య మధ్యలో స్క్వాట్స్ చేసిన వారిలో చక్కెర స్థాయిలు అత్యంత సమర్థవంతంగా అదుపులో ఉన్నట్లు వెల్లడైంది. కండరాల ప్రభావం..స్క్వాట్స్ వల్ల రక్తంలో చక్కెర ఎందుకు తగ్గుతుందనే దానికి డాక్టర్ పెర్ల్‌ముట్టర్ ఒక సైంటిఫిక్ కారణాన్ని వివరించారు. మన శరీరంలోని అతిపెద్ద కండరాలైన గ్లూటియస్ మాక్సిమస్ క్వాడ్రిసెప్స్ స్క్వాట్స్ చేసినప్పుడు ఉత్తేజితం అవుతాయి. ఈ పెద్ద కండరాలు రక్తంలోని గ్లూకోజ్‌ను ఇంధనంగా వేగంగా గ్రహిస్తాయి. దీనివల్ల శరీరంలో ఇన్సులిన్ సెన్సిటివిటీ పెరిగి, చక్కెర స్థాయిలు అదుపులోకి వస్తాయి. ఒకేసారి గంటల కొద్దీ వ్యాయామం చేయడం కంటే, ఇలా కండరాలకు తరచుగా పని చెప్పడం వల్ల మెటబాలిక్ రేటు మెరుగుపడుతుంది. రోజంతా కదలకుండా కూర్చునే వారికి ఈ 'ఎక్సర్‌సైజ్ స్నాక్స్' ఒక వరం లాంటివి. ప్రతి 45 నిమిషాలకు ఒకసారి కేవలం పది స్క్వాట్స్ చేయడం లేదా కాసేపు నడవడం వల్ల శరీర మెటబాలిజం మెరుగుపడటమే కాకుండా, అది మెదడు ఆరోగ్యంపై కూడా సానుకూల ప్రభావం చూపుతుంది. మెటబాలిజం మరియు మెదడు ఆరోగ్యం ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. ఆఫీసుల్లో పని చేసే వారు లేదా ఇంట్లో ఎక్కువ సమయం కూర్చునే వారు ఈ చిన్న మార్పును అలవాటు చేసుకుంటే భవిష్యత్తులో వచ్చే ఎన్నో అనారోగ్య సమస్యల నుంచి బయటపడవచ్చు. నడక అనేది ఎప్పటికీ మంచి వ్యాయామమే, కానీ కూర్చుని పని చేసే వారు మాత్రం మధ్య మధ్యలో లేచి కొన్ని స్క్వాట్స్ చేయడం వల్ల అదనపు ప్రయోజనం పొందుతారు. జీవనశైలిలో పెద్ద మార్పులు చేయకుండానే కేవలం పది సెకన్ల పాటు చేసే ఈ పని మీ ఆరోగ్యాన్ని కాపాడుతుంది.

# ఆరోగ్యకరమైన తీపి వెనుక అసలు నిజాలు





ఆరోగ్యంపై అవగాహన పెరుగుతున్న కొద్దీ చాలా మంది తెల్ల చక్కెర వాడకాన్ని దాదాపుగా తగ్గించేస్తున్నారు. ఆ చక్కెరకు ప్రత్యామ్నాయాల వాడకానికి ఆసక్తి కనబరుస్తున్నారు. పంచదారకు బదులుగా మన భారతీయ వంటగదిలో ఎప్పటి నుంచో ఉన్న సహజసిద్ధమైన తీపి పదార్థాల వైపు మొగ్గు చూపుతున్నారు. ముఖ్యంగా బరువు తగ్గాలని ప్రణాళికలు వేసుకునే వారు.. పంచదారకు ప్రత్యామ్నాయంగా రెండు రకాల పదార్థాలను ఎక్కువగా వాడుతుంటారు. ఒకటి నేరుగా చెట్టు నుంచి వచ్చే పండు అయితే, మరొకటి చెరకు రసం నుంచి తయారయ్యే సంప్రదాయ స్వీటెనర్. ఈ రెండూ ఆరోగ్యానికి మేలు చేసేవే అయినప్పటికీ, వెయిట్ లాస్ విషయంలో మాత్రం వీటి ప్రభావం వేర్వేరుగా ఉంటుంది. ఒకటి తింటే ఆకలి నియంత్రణలో ఉంటుంది, మరొకటి తింటే రక్తంలో చక్కెర స్థాయిలు వేగంగా పెరిగే అవకాశం ఉంటుంది. ఇంతకీ బరువు తగ్గడానికి ఏది బెస్ట్ ఆప్షన్? ఖర్జూరం మెరుగైనదా లేక బెల్లం మేలైనదా?

ఆకలి అదుపులో.. ఖర్జూరాలను పూర్తి స్థాయి పండ్లగా పరిగణిస్తారు. వీటిలో సహజమైన తీపితో పాటు ఫైబర్ (పీచు పదార్థం), అవశ్యక ఖనిజాలు, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇందులోని ఫైబర్ జీర్ణక్రియను నెమ్మదింపజేసి, కడుపు నిండుగా ఉన్న అనుభూతిని కలిగిస్తుంది. దీనివల్ల రక్తంలో చక్కెర స్థాయిలు అకస్మాత్తుగా పెరగవు. ఖర్జూరాలను నమలడానికి సమయం పడుతుంది కాబట్టి, ఇవి ఆకలిని నియంత్రించడంలో సహాయపడతాయి. తద్వారా పదే పదే స్నాక్స్ తినాలనే కోరిక తగ్గుతుంది. క్యాలరీలను నియంత్రించాలనుకునే వారికి ఇది ఒక గొప్ప వరం. బెల్లం అనేది చెరకు రసం లేదా తాటి రసం నుంచి తయారవుతుంది. ఇది తెల్ల చక్కెర కంటే మెరుగైనదే అయినప్పటికీ, తయారీ సమయంలో ఇందులోని పీచు పదార్థం చాలా వరకు కోల్పోతుంది. ఇందులో ఐరన్, పొటాషియం, మెగ్నీషియం వంటి ఖనిజాలు ఉన్నప్పటికీ.. ఇది రక్తంలోకి త్వరగా శోషించబడుతుంది. పీచు పదార్థం తక్కువగా ఉండటం వల్ల బెల్లం తిన్న తర్వాత కడుపు నిండిన భావన కలగదు. పైగా తిన్న కాసేపటికే మళ్ళీ ఏదైనా తీపి తినాలనే కోరికను ఇది కలిగిస్తుంది.

గ్లైసీమిక్ ఇండెక్స్..బరువు తగ్గడంలో రక్తంలోని చక్కెర ప్రతిస్పందన చాలా ముఖ్యం. ఖర్జూరాలలో ఫైబర్ ఉండటం వల్ల వీటి గ్లైసీమిక్ ఇండెక్స్ తక్కువ నుంచి మధ్యస్థంగా ఉంటుంది. ఇది స్థిరమైన శక్తిని అందిస్తుంది. కానీ బెల్లం గ్లైసీమిక్ ఇండెక్స్ ఎక్కువగా ఉంటుంది. ఇది రక్తంలో చక్కెరను వేగంగా పెంచి, అంతే వేగంగా తగ్గిస్తుంది. దీనివల్ల నీరసం రావడం, మళ్ళీ ఆకలి వేయడం వంటివి జరుగుతాయి. అందుకే వెయిట్ లాస్ డైట్‌లో ఉన్నవారు ఖర్జూరానికే మొదటి ప్రాధాన్యత ఇస్తుంటారు. ఏదైనా సరే అతిగా తింటే అనర్థమే. ఖర్జూరాలు నమలడానికి కష్టంగా, కడుపు నింపేలా ఉంటాయి కాబట్టి ఒకటి రెండు తినగానే సంతృప్తి కలుగుతుంది. కానీ బెల్లం విషయానికి వస్తే.. టీలోనో, స్వీట్లలోనో కలిపి తిన్నప్పుడు మనం ఎంత పరిమాణంలో తీసుకుంటున్నామో తెలియకుండానే ఎక్కువ క్యాలరీలను పొందే అవకాశం ఉంది. పోషకాహార నిపుణుల ప్రకారం.. బరువు తగ్గాలనుకునే వారు రోజుకు ఒకటి లేదా రెండు ఖర్జూరాలు తీసుకోవడం మంచిది. అదే బెల్లం అయితే అర టీస్పూన్ కు మించకూడదని సూచిస్తున్నారు.

# మెంతి నీరు.. ఫలితాలు చూస్తే నోరెళ్లబెడతారు



మన వంటింట్లో లభించే పోషకాల గని మెంతులు. కేవలం వంటలకు రుచిని ఇవ్వడమే కాదు ఔషధ గుణాల విషయంలో మెంతులకు సాటిలేదు. రాత్రంతా నీటిలో నానబెట్టిన మెంతి గింజల నీటిని ఉదయాన్నే ఖాళీ కడుపుతో తాగడం వల్ల అద్భుతమైన ఫలితాలు ఉంటాయని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా వరుసగా 11 రోజుల పాటు× ఈ నీటిని తాగితే శరీరంలో స్పష్టమైన మార్పులు కనిపిస్తాయని వారు వివరిస్తున్నారు. జీర్ణ వ్యవస్థకు పునరుజ్జీవం: మెంతుల్లో కరిగే ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. 11 రోజుల పాటు క్రమం తప్పకుండా మెంతి నీటిని తాగడం వల్ల గ్యాస్, అజీర్ణం, మలబద్ధకం వంటి దీర్ఘకాలిక సమస్యల నుండి ఉపశమనం లభిస్తుంది. ఇది జీర్ణక్రియను మెరుగుపరిచి కడుపును తేలికగా ఉంచుతుంది. చక్కెర స్థాయిల నియంత్రణ: మధుమేహ వ్యాధిగ్రస్తులకు మెంతి నీరు ఒక సహజ ఔషధంలా పనిచేస్తుంది. ఇది రక్తంలో చక్కెర శోషణను నెమ్మదింపజేసి, ఇన్సులిన్ పనితీరును మెరుగుపరుస్తుంది. 11 రోజుల చికిత్స తర్వాత చక్కెర స్థాయిలు స్థిరంగా ఉండటాన్ని గమనించవచ్చని నిపుణులు చెబుతున్నారు. ఇప్పటికే డయాబెటిస్ మందులు వాడుతున్న వారు వైద్యుడిని సంప్రదించిన తర్వాతే దీనిని ప్రారంభించాలి. చెడు కొలెస్ట్రాల్‌కు చెక్: గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో మెంతి నీరు కీలక పాత్ర పోషిస్తుంది. ఇందులోని యాంటీఆక్సిడెంట్లు శరీరంలోని చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి, ధమనుల్లో అడ్డంకులు ఏర్పడకుండా చూస్తాయి. 11 రోజుల నిరంతర వాడకం వల్ల రక్త ప్రసరణ మెరుగుపడుతుంది. శరీర వేడి, వాపుల నుండి రిలీఫ్: శరీరంలో అధిక వేడితో బాధపడేవారికి మెంతి నీరు చలవ చేస్తుంది. ఇందులోని సహజ శోథ నిరోధక లక్షణాలు కీళ్ల నొప్పులు, మంట మరియు శరీర వాపులను తగ్గించడంలో సహాయపడతాయి. ఇది మూత్రపిండాల పనితీరును మెరుగుపరిచి శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచుతుంది. సహజ శక్తి – మెరిసే చర్మం: మెంతి నీటిలో ఉండే విటమిన్లు, ఖనిజాలు అలసటను తగ్గించి రోజంతా ఉత్సాహంగా ఉండేలా చేస్తాయి. శరీరంలోని వ్యర్థాలను బయటకు పంపడం ద్వారా చర్మం సహజంగా మెరుస్తుంది. జాగ్రత్తలు తప్పనిసరి: మెంతి నీరు ఆరోగ్యానికి మేలు చేసినప్పటికీ.. గర్భిణీ స్త్రీలు, థైరాయిడ్ సమస్యలు ఉన్నవారు లేదా ఏదైనా ప్రత్యేక వైద్య చికిత్స పొందుతున్న వారు వైద్యుని సలహా తీసుకున్న తర్వాతే దీనిని క్రమం తప్పకుండా తాగడం మంచిది.

బిజినెస్

## వెండి వెలవెల..!
### మళ్లీ భారీగా తగ్గిన రేటు




బంగారం, వెండి ధరల పతనం సామాన్యులకు ఊరటనిస్తోంది. గత కొన్ని రోజులుగా అమాంత పెగిగిన ధరలు ఒక్కసారిగా దిగివస్తున్నాయి. ఇవాళ హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో నేడు కిలో వెండి ధరపై ఏకంగా రూ.20,000 వేలు తగ్గింది. ఈ పరిణామం కిలో వెండి ధర రూ.2,80,000 వద్దకు చేరుకుంది. గత రెండు రోజుల్లోనే వెండి ధర ఏకంగా రూ. 40,000 మేర క్షీణించడం ఇన్వెస్టర్లను, కొనుగోలుదారులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. నిన్న కూడా కిలోపై రూ.20 వేల మేర తగ్గిన విషయం తెలిసిందే. మరోవైపు 10 గ్రాముల 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారంపై రూ.2,070 తగ్గి రూ.1,52,350 వద్ద ధర కొనసాగుతుండగా.. 22 క్యారెట్ బంగారంపై రూ.1,900 తగ్గి ధర 10 గ్రాములకు రూ.1,39,650గా ఉంది. ప్రపంచ మార్కెట్‌లో వెండి ధరలు గణనీయంగా తగ్గడం స్థానిక మార్కెట్‌పై ప్రభావం చూపుతోంది. ధరలు రికార్డు స్థాయికి చేరడంతో ఇన్వెస్టర్లు పెద్ద ఎత్తున వెండిని విక్రయించి లాభాలను స్వీకరిస్తున్నారు. అంతర్జాతీయంగా డాలర్ విలువ పెరగడం వల్ల బంగారం, వెండి ధరలు తగ్గుముఖం పట్టాయి. పెళ్లిళ్ల సీజన్ సమీపిస్తున్న తరుణంలో ఈ ధరల తగ్గింపు మధ్యతరగతి ప్రజలకు పెద్ద ఊరటనిస్తోంది. అయితే, అంతర్జాతీయ పరిణామాల దృష్ట్యా ధరలు మరికొంత కాలం ఒడిదుడుకులకు లోనయ్యే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు.

### ఎల్ఐసి ఫలితాలు ఆకర్షణీయం

దేశంలోనే అతిపెద్ద జీవిత బీమా కంపెనీ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసి) ఆకర్షణీయ ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2025-26 డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో రూ.12,930 కోట్ల నికర లాభాలు సాధించింది. ఇంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలోని రూ.11,008 కోట్ల లాభాలతో పోల్చితే 17 శాతం వృద్ధిని సాధించింది. క్రితం క్యూ3లో ఈ ప్రభుత్వ రంగ దిగ్గజం నికర ప్రీమియం ఆదాయం 17 శాతం పెరిగి రూ.1.26 లక్షల కోట్లకు చేరింది. 2024?25 ఇదే క్యూ3లో రూ.1.07 లక్షల కోట్ల ప్రీమియంను నమోదు చేసింది. ఆర్థిక సంవత్సరం 2025?26 డిసెంబర్‌తో ముగిసిన తొమ్మిది నెలల కాలంలో ఎల్ఐసి మొత్తంగా 1,16,63,856 పాలసీలను విక్రయించగా.. ఇంతక్రితం ఏడాది ఇదే సమయంలో 1,17,10,505 పాలసీల అమ్మకాలను నమోదు చేసింది. ఇదే సమయంలో రూ.3,40,563 కోట్లుగా ఉన్న మొత్తం ప్రీమియం ఆదాయం.. 2025 డిసెంబర్‌తో ముగిసిన తొమ్మిది మాసాల్లో 9.02 శాతం పెరిగి రూ.3,71,293 కోట్లుగా చోటు చేసుకుంది. 2025 డిసెంబర్ ముగింపు నాటికి ఎల్ఐసి మొత్తం ఆస్తుల నిర్వహణ (ఎయుఎం) 8.01 శాతం పెరిగి రూ.59,16,680 కోట్లకు చేరింది. 2024 ఇదే సమయం నాటికి రూ.54,77,651 కోట్లుగా ఎయుఎం ఉంది. జీవిత బీమా మార్కెట్‌లో రెండు డజన్ల పైగా కంపెనీలున్నప్పటికీ బీమా వ్యాపారంలో ఎల్ఐసి ఇప్పటికీ 57.07 శాతం వాటాతో మార్కెట్ లీడర్‌గా కొనసాగుతోంది. 2024 డిసెంబర్ నాటి 57.42 శాతం వాటాతో పోల్చితే స్వల్పంగా తగ్గింది. గురువారం బిఎస్ఇలో ఎల్ఐసి షేర్ 0.65 శాతం పెరిగి రూ.840.45 వద్ద ముగిసింది.

## 38 నెలల కనిష్టానికి
# రష్యా చమురు దిగుమతులు




గతేడాది డిసెంబర్‌లో రష్యా నుండి భారత్‌కు ముడి చమురు దిగుమతుల విలువ 38 నెలల కనిష్టానికి 2.7 బిలియన్ డాలర్లకు పడిపోయింది. అదే సమయంలో 2024 డిసెంబర్ కంటే అమెరికా నుండి దిగుమతులు సుమారు 13శాతం పెరిగాయని తాజా నివేదిక తెలిపింది. భారతదేశ దిగుమతుల్లో రష్యన్ చమురు నాలుగో వంతు కంటే తక్కువగా ఉందని, ఇది గత నెల 34శాతం నుండి తగ్గిందని పేర్కొంది. భారత్ రష్యా నుండి చమురు కొనుగోళ్లను నిలిపివేస్తుందని, బదులుగా భారత్ దిగుమతులపై టారిఫ్‌లను 50శాతం నుండి 18శాతానికి తగ్గించినట్లు గతవారం రోజుల నుండి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పదేపదే ప్రకటిస్తున్న సమయంలో తాజా డేటా వెలువడింది. అయితే ఈ ప్రకటనను భారత ప్రభుత్వం ధృవీకరించలేదు లేదా తిరస్కరించలేదు. నిష్పాక్షిక మార్కెట్ పరిస్థితులకు మరియు అభివృద్ధి చెందుతున్న అంతర్జాతీయ పరిణామాలకు అనుగుణంగా తన ఇంధనవనరులను మారుస్తున్నట్లు విదేశాంగ శాఖ వాదిస్తోంది. డిసెంబర్ 2025లో 2.7బిలియన్ డాలర్లుగా ఉన్న భారతదేశ రష్యన్ చమురు దిగుమతులు, డిసెంబర్ 2024లో దిగుమతి చేసుకున్న మొత్తం కంటే 15శాతం తక్కువగా ఉన్నాయి. మరియు నవంబర్ 2025లో 3.7బిలియన్ డాలర్ల విలువైన దిగుమతుల కంటే 27.1శాతం తక్కువగా ఉన్నాయి. భారతదేశ మొత్తం చమురు దిగుమతుల్లో రష్యా వాటా డిసెంబర్ 2025లో 24.9శాతానికి పడిపోయింది. ఇది మూడు సంవత్సరాల్లో అత్యల్పం. పరిమాణంతో పోలిస్తే.. భారత్ 5.8 మిలియన్ టన్నులను దిగుమతి చేసుకుంది. ఇది 2025 ఫిబ్రవరి తర్వాత అత్యల్పం. భారతదేశం డిసెంబర్ 2025లో అమెరికా నుండి 569.3 మిలియన్ల విలువైన చమురు దిగుమతి చేసుకుంది. ఇది నవంబర్ 2025లో దిగుమతి చేసుకున్న మొత్తం కంటే 60.5శాతం తక్కువగా ఉన్నప్పటికీ, నవంబర్‌లో అమెరికా నుండి చమురు దిగుమతులు ఏడు నెలల గరిష్టస్థాయికి పెరగడం కారణం. అమెరికా నుండి చమురు దిగుమతులు డిసెంబర్ 2024 కంటే సుమారు 31శాతం అధికం.

## ఆర్బీఐ కీలక నిర్ణయం.. రెపో రేట్లు యథాతథం




బలమైన ఆర్థిక శక్తిగా భారత్ ఆవిర్భవించిన వేళ ఇవాళ జరిగిన రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్రవ్య పరపతి సమీక్ష సమావేశంలో గవర్నర్ సంజయ్ మల్హోత్రా కీలక నిర్ణయాలను వెల్లడించారు. ఈ మేరకు ఆర్‌బీఐ రెపో రేటును 5.25 శాతం వద్దే కొనసాగించాలని నిర్ణయించింది. ఇందులో ఎలాంటి మార్పు చేయబోమని స్పష్టం చేశారు. గత ఏడాది కాలంలో ఇప్పటికే 125 బేసిస్ పాయింట్ల వరకు కోత విధించిన నేపథ్యంలో, ప్రస్తుత ఆర్థిక పరిస్థితులను బట్టి ఈసారి నిలిపివేయాలని కమిటీ నిర్ణయించింది. స్టాండర్డ్ డిపాజిట్ ఫెసిలిటీపై 5 శాతం, మార్జినల్ స్టాండిగ్ ఫెసిలిటీపై 5.50 శాతం, బ్యాంకు రేటుపై 5.50 శాతం, క్యాష్ రిజర్వ్ రేషియోపై వడ్డీ రేట్లు 3 శాతంగా ఉండనున్నట్లుగా వెల్లడించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం కోసం జీడీపీ వృద్ధి అంచనాను మునుపటి 6.8 శాతం నుంచి 7.4కి పెంచింది. భారత ఆర్థిక వ్యవస్థ బలంగా ఉందని గవర్నర్ పేర్కొన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం కోసం ద్రవ్యోల్బణం అంచనాను 2.6 శాతం నుంచి 2 శాతాకి తగ్గించారు. ద్రవ్యోల్బణం అదుపులో ఉండటం సానుకూల అంశమని ఎంపీసీ కమిటీ తెలిపింది. అదేవిధంగా మార్కెట్‌లో నగదు లభ్యతను పెంచడానికి రూ.1 లక్షల కోట్ల విలువైన ప్రభుత్వ సెక్యూరిటీల కొనుగోలు చేపట్టనున్నట్లుగా ప్రకటించారు. అమెరికా, యూరోపియన్ యూనియన్‌తో కుదిరిన వాణిజ్య ఒప్పందాల వల్ల భారత ఎగుమతులు పెరిగే అవకాశం ఉందని, ఇది ఆర్థిక వృద్ధికి తోడ్పడుతుందని గవర్నర్ సంజయ్ మల్హోత్రా వివరించారు. ఇక వార్షిక బడ్జెట్ సమావేశాల తర్వాత తర్వాత జరిగిన ఈ మొదటి సమీక్షలో వృద్ధిని ప్రోత్సహిస్తూనే ద్రవ్యోల్బణాన్ని అదుపులో ఉంచేలా ఆర్‌బీఐ సమతుల్య నిర్ణయం తీసుకుంది. దీంతో ప్రస్తుతానికి హోమ్ లోన్, ఇతర రుణాల ఈఎంఐల్లో మార్పులు ఉండే అవకాశం లేదు.

---

# వైభవ్ శతక విధ్వంసం..
# నాలుగొందలు కొట్టిన టీమిండియా!



అండర్-19 వరల్డ్‌కప్ ఫైనల్లో భారత ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ(175) శతక్కొట్టుడు కొట్టాడు. దొరికిన బంతిని దొరికినట్టు బౌండరీకి పంపి ఇంగ్లండ్ బౌలర్లకు వెన్నులో వణుకు పుట్టిస్తూ.. మెరుపు సెంచరీతో భారీ స్కోర్‌కు బలమైన పునాది వేశాడు. కెప్టెన్ ఆయుష్ మాత్రే(53), ఆఖర్లో అభిగ్యాన్ కుందు(40) సైతం దంచేశారు. ఆఖర్లో కనిష్క్ చౌహన్(37 నాటౌట్) మెరుపులతో టీమిండియా నాలుగొందలు కొట్టింది. అజేయంగా ఫైనల్‌కు దూసుకెళ్లిన భారత జట్టుకు అంతిమ పోరులోనూ బ్యాటర్లు కొండంత స్కోర్ అందించారు. ఇంగ్లండ్ బౌలర్లను ఊచకోత కోస్తూ వైభవ్ సూర్యవంశీ(175) విధ్వంసం సృష్టించాడు. 20 పరుగులకే ఆరోన్ జార్జ్(9) ఔటైనా.. వైభవ్ ఆకాశమే హద్దుగా ఆడుతూ కెప్టెన్ ఆయుష్ మాత్రే(53)తో కలిసి ప్రత్యర్థి బౌలర్లకు చుక్కలు చూపించాడు. బంతి గమ్యం బౌండరీయే అన్నట్టుగా చెలరేగి స్కోర్‌బోర్డును ఉరికించిన అతడు 55 బంతుల్లోనే సెంచరీ సాధించాడు. శతకం తర్వాత కూడా జోరు తగ్గించని వైభవ్ జట్టు స్కోర్ 251వద్ద వెనుదిరిగాడు. వైభవ్ అనంతరం విహాన్ మల్హోత్రా(30), వేదాంత్ త్రివేది(32)లో అర్ధ శతక భాగస్వామ్యం నెలకొల్పారు. వీరిద్దరిని జేమ్స్ మింటో వెనక్కి పంపడంతో ఇంగ్లండ్ ఊపిరిపీల్చుకుంది.

**కుందు, కనిష్క్ మెరవగా..**

వైభవ్ ఉన్నంత సేపు రాకెట్‌లా పరుగెత్తిన భారత స్కోర్‌బోర్డు.. విహాన్, వేదాంత్‌లు వెనుదిరిగాక నెమ్మదించింది. అయితే.. కాస్త కుదురుకున్నాక గేర్ మార్చిన అభిగ్యాన్ కుందు(40) మన్నీ ఓవర్లో 4, 6, 4, 4తో స్కోర్ 350 దాటించాడు. ఆ తర్వాత పుంజుకున్న ప్రత్యర్థి బౌలర్లు అంబ్రిష్(18)ను బౌల్డ్ చేయగా.. ఖిలాన్ పటేల్(3)ను సెబాస్టియన్ బోల్తా కొట్టించాడు. అనంతరం కనిష్క్ చౌహన్(27 నాటౌట్), హెనిల్ పటేల్(5), జతగా ఇన్నింగ్స్ ఆఖరి ఓవర్లో రెండు ఫోర్లతో టీమిండియా 400ల మార్క్ చేరింది. టాపార్డర్, మిడిలార్డర్ రాణించగా ప్రత్యర్థికి 412 పరుగుల కొండంత లక్ష్యాన్ని నిర్దేశించింది మాత్రే సేన.

### ఇంగ్లండ్‌తో అండర్19 వరల్డ్‌కప్ ఫైనల్..
### సూపర్ సెంచరీ కొట్టిన వైభవ్ సూర్యవంశీ



**హరారే:** ఇంగ్లండ్‌తో జరుగుతున్న అండర్19 వరల్డ్‌కప్ ఫైనల్లో ఇండియన్ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీ(ఖుఅఎ్ఘుజ రాశీశీతీఖుఖుఅంఫ్తుఅ) సూపర్ సెంచరీ నమోదు చేశాడు. సిక్సర్లు, ఫోర్లతో హోరెత్తిస్తున్న సూర్యవంశీ కేవలం 55 బంతుల్లో సెంచరీ నమోదు చేశాడు. అతని సెంచరీ ఇన్నింగ్స్‌లో 8 ఫోర్లు, 8 సిక్సర్లు ఉన్నాయి. ఆరంభం నుంచి సూర్యవంశీ క్వాలిటీ స్ట్రోక్స్‌తో ఆకట్టుకున్నాడు. భారీ సిక్సర్లతో ఇంగ్లండ్ స్పిన్ బౌలర్లకు చుక్కలు చూపించాడు. కెప్టెన్ ఆయుష్ మాత్రే 53 రన్స్ స్కోరు చేసి ఔటయ్యాడు. తొలుత టాస్ గెలిచిన ఇండియా బ్యాటింగ్ ఎంచుకున్నది. తాజా సమాచారం ప్రకారం ఇండియా 21 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 186 రన్స్ చేసింది. ఈ వరల్డ్‌కప్‌లో అరుదైన రికార్డును సొంతం చేసుకున్నాడు సూర్యవంశీ. అండర్19 వరల్డ్‌కప్‌లో అత్యధిక సిక్సర్లు కొట్టిన బ్యాటర్‌గా నిలిచాడు. ఈ టోర్నీలో ఇప్పటికే 20 సిక్సర్లు కొట్టాడు వైభవ్. అత్యధిక సిక్సర్లు కొట్టిన బ్యాటర్లలో డెవాల్డ్ బ్రెవిస్ 18(2022), ఫిన్ అలెన్ 18(2016, 2018) సిక్సర్లు కొట్టారు

స్పోర్ట్స్

### పొట్టి ప్రపంచకప్‌లో వీరబాదుడు..
### శతకంతో గర్జించిన రైనా, గేల్..!



రేపటి నుంచే పదో సీజన్ టీ20 వరల్డ్‌కప్ పండుగ షురూ కానుంది. భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న ఈ మెగా టోర్నీలో ఇరవై జట్లు.. కప్ వేటకు సిద్ధమవుతు న్నాయి. పొట్టి ఫార్మాట్ అంటేనే చెలరేగిపోయే పవర్ హిట్టర్లు ప్రపంచకప్‌లో ఊరికే ఉంటారా. తమదైన విధ్వంసంతో అభిమానులను అలరిస్తూ శతకాలతో చెలరేగిపోతుం టారు. ఈ ఐసీసీ ఈవెంట్‌లో ఇప్పటివరకూ 11 సెంచరీలు నమోదవ్వగా.. భారత్ నుంచి సురేశ్ రైనా వంద కొట్టేశాడు. ఆరంభ సీజన్‌తో మొదలు ఎవరెవరు ఎన్ని సార్లు మూడంకెల స్కోర్‌తో విరుచుకుపడ్డారో తెలుసుకుందాం. ప్రపంచకప్ అంటే చాలు కొంతమంది క్రికెటర్లు పూనకం వచ్చినట్టు రెచ్చిపోతారు. మేము ఆడితే రికార్డులు బద్ధలవ్వాల్సిందే అన్నట్టుగా బౌలర్ల భరతం పడుతూ సెంచరీలతో అలరిస్తారు. ఐసీసీ 2007లో తొలిసారి నిర్వహించిన పొట్టి ప్రపంచకప్‌లో క్రిస్ గేల్ శతకంతో మెరిశాడు. ఆతిథ్య దక్షిణాఫ్రికాపై ఉప్పెనలా విరుచుకుపడిన గేల్ .. 57 బంతుల్లోనే 10 సిక్సర్లు, 7 ఫోర్లతో 117 రన్స్ సాధించాడు. పొట్టి ప్రపంచకప్‌లో రెండో సెంచరీ మాత్రం సురేశ్ రైనాదే. 2010లో ఈ లెఫ్ట్ హ్యాండర్ సైతం సఫారీలపైనే వందతో గర్జించాడు. గ్రాస్ ఇస్లెట్ మైదానంలో చెలరేగిన రైనా.. 60 బంతుల్లో 9 ఫోర్లు, 5 సిక్సర్లతో 101 రన్స్ చేశాడు. ఈ మెగా టోర్నీలో మూడో సెంచరీ శ్రీలంక వెటరన్ మహేల జయవర్దనే నమోదు చేశాడు. ఇదే ఎడిషన్‌లో జింబాబ్వేపై అతడు వంద కొట్టాడు. 2012 ఎడిషన్‌లో న్యూజిలాండ్ దిగ్గజం బ్రెండన్ మెక్‌కల్లమ్ తన మార్క్ విధ్వంసంతో.. బంగ్లాదేశ్‌పై శతకంతో గర్జించాడు. ఇంగ్లండ్ ఓపెనర్ అలెక్స్ హేల్స్ శ్రీలంకపై, పాకిస్థాన్ ఆటగాడు అహ్మద్ షెహజాద్ బంగ్లాదేశ్‌పై, తమీమ్ ఇక్బాల్ ఒమన్‌పై సెంచరీలు సాధించారు. 2016 వరల్డ్‌కప్‌లో సునామీ ఇన్నింగ్స్‌తో ఇంగ్లండ్ బౌలర్లను బెంబేలెత్తించిన క్రిస్ గేల్ అజేయ శతకం సాధించాడు. అనంతరం జోస్ బట్లర్ శ్రీలంకపై, రీలే రసో బంగ్లాదేశ్‌పై, గ్లెన్ ఫిలిప్స్ శ్రీలంకపై సెంచరీతో చెలరేగారు.

**సెంచరీ వీరులు..**

క్రిస్ గేల్(2007), సురేశ్ రైనా(2010), మహేల జయవర్దనే(2010), బ్రెండన్ మెక్‌కల్లమ్(2012), అలెక్స్ హేల్స్(2014), అహ్మద్ షెహజాద్(2014), తమీమ్ ఇక్బాల్(2016), క్రిస్ గేల్ (2016), జోస్ బట్లర్ (2021), రీలే రసో(2022), గ్లెన్ ఫిలిప్స్(2022). అయితే.. గత ఎడిషన్లో మాత్రం ఒక్క సెంచరీ నమోదవ్వలేదు. కానీ, ఈసారి భీకర ఫామ్‌లో ఉన్న భారత ఓపెనర్ అభిషేక్ శర్మ వంద కొట్టినా కొట్టేస్తాడు. టీమిండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ సహా స్క్వాడ్‌లోని శాంసన్, ఇషాన్ కిషన్, తిలక్ వర్మలు ఈ ఫార్మాట్లో సెంచరీలు సాధించిన వారే.




# సమ్మర్ 2026పై మెగా ముద్ర

సంక్రాంతి 2026 సీజన్‌లో మెగాస్టార్ చిరంజీవి బాక్సాఫీస్ వద్ద ఘన విజయాన్ని అందుకున్నారు. పక్కా ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా విడుదలైన 'మన శంకర వరప్రసాద్ గారు' చిత్రం ఏకంగా రూ.375 కోట్లకు పైగా వసూళ్లు సాధించి టాలీవుడ్ ఇండస్ట్రీ హిట్‌గా నిలిచింది. సంక్రాంతి సీజన్ ముగియడంతో ఇప్పుడు సినీ ప్రేక్షకుల దృష్టంతా సమ్మర్ సీజన్‌పై పడింది. ఈ నేపథ్యంలో పెద్ద సినిమాలన్నీ వరుసగా వేసవి విడుదలలకు సిద్ధమవుతున్నాయి. ప్రస్తుతం పరిస్థితులు గమనిస్తే సమ్మర్ 2026పై మెగా ఫ్యామిలీ డామినేషన్ స్పష్టంగా కనిపిస్తోంది. ఒకటి కాదు, రెండు కాదు ఏకంగా ఐదు సినిమాలు మెగా కుటుంబం నుంచి విడుదలకు రెడీ అవ్వడం విశేషం. అందులో మెగాస్టార్ చిరంజీవి, మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ వంటి టాప్ హీరోల సినిమాలు కూడా ఉండటంతో అంచనాలు మరింత పెరిగాయి. ఈ సమ్మర్ సీజన్‌కు శ్రీకారం చుట్టేది పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ అనే చెప్పాలి. పవన్ కళ్యాణ్ హీరోగా తెరకెక్కుతున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రం మార్చి 26న థియేటర్లలోకి రానుంది. ఇప్పటికే ఈ సినిమాపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఆ తరువాత మెగా డాటర్ నిహారిక నిర్మాతగా ఉన్న 'రాకాస' చిత్రం ఏప్రిల్ 3న విడుదలకు సిద్ధమవుతోంది. సంగీత్ శోభన్ హీరోగా నటిస్తున్న ఈ మూవీ ఫాంటసీహారర్ కామెడీ జానర్‌లో రాబోతోంది. తర్వాత మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ సమయం మొదలవుతుంది. ఆయన హీరోగా తెరకెక్కుతున్న 'పెద్ది' చిత్రం ఏప్రిల్ 30న ప్రేక్షకుల ముందుకు రానుంది. పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతున్న ఈ సినిమాపై దేశవ్యాప్తంగా మంచి హైప్ ఉంది. భారీ బడ్జెట్, భారీ అంచనాలతో ఈ చిత్రం సమ్మర్ హైలైట్‌గా నిలుస్తుందనే టాక్ వినిపిస్తోంది. ఇక మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న మరో ప్రతిష్టాత్మక చిత్రం 'విశ్వంభర'. దర్శకుడు వశిష్ట రూపొందిస్తున్న ఈ పాన్ ఇండియా ఫాంటసీ డ్రామా భారీ గ్రాఫిక్స్‌తో జూలైలో విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. విజువల్ వండర్‌గా నిలిచే అవకాశమున్న ఈ సినిమా కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అదే సమయంలో మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ హీరోగా నటిస్తున్న 'కొరియన్ కనకరాజు' కూడా సమ్మర్ బరిలోకి దిగుతోంది. మేర్లపాక గాంధీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ హారర్ కామెడీ ఎంటర్‌టైనర్‌లో రితికా నాయక్ హీరోయిన్‌గా నటిస్తోంది. వినోదాత్మక అంశాలతో ఈ చిత్రం ప్రేక్షకులను ఆకట్టుకునే అవకాశం ఉందని సినీ వర్గాలు భావిస్తున్నాయి.ఇలా ఒకే సమ్మర్ సీజన్‌లో మెగా ఫ్యామిలీ నుంచి వరుసగా ఐదు సినిమాలు విడుదల కావడం టాలీవుడ్‌లో అరుదైన విషయంగా మారింది. బాక్సాఫీస్ వద్ద ఈ మెగా సినిమాలు ఎలాంటి ఫలితాలు సాధిస్తాయో, ప్రేక్షకులు ఏ చిత్రానికి ఎక్కువ ఆదరణ చూపిస్తారో అనేది ఆసక్తికరంగా మారింది. ఈ వేసవి నిజంగా "మెగా సమ్మర్"గా నిలిచే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

# ప్రతినాయిక ఛాయలున్న పాత్రలో?

అల్లు అర్జున్ – రష్మికలది వెండితెరపై హిట్ జోడీ. ఈ ఇద్దరూ విజయవంతమైన 'పుష్ప' సిరీస్ సినిమాలతో అందర్నీ మెప్పించారు. వీళ్లిద్దరూ ఇప్పుడు మరోసారి కలిసి తెర పంచుకుంటున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం అల్లు అర్జున్ హీరోగా అట్లీ దర్శకత్వంలో ఓ బహుభాషా చిత్రం సిద్ధమవుతున్న సంగతి తెలిసిందే. సన్‌పిక్చర్స్ పతాకంపై కళానిధి మారన్ నిర్మిస్తున్నారు. చిత్రీకరణ దశలో ఉన్న ఈ సినిమాలో రష్మిక ఓ కీలక పాత్ర పోషించనున్నట్లు కొన్నాళ్లుగా వార్తలు వినిపిస్తున్నాయి. ఇప్పుడా పాత్ర చిత్రీకరణ కోసం ఆమె సెట్స్‌లోకి అడుగు పెట్టిందని బాలీవుడ్ వర్గాల సమాచారం. ఇందులో రష్మికది ప్రతినాయిక ఛాయలున్న పాత్రగా ఉంటుందని తెలుస్తోంది. ప్రస్తుతం ముంబయిలో జరుగుతున్న కొత్త షెడ్యూల్‌లో ఆమెతో పాటు ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాలు తెరకెక్కిస్తున్నట్లు వార్తలొస్తున్నాయి. ఇది సైన్స్ ఫిక్షన్ అంశాలతో నిండిన ఆసక్తికర కథతో రూపొందుతున్న సినిమా. అల్లు అర్జున్ ఇందులో రెండు భిన్నమైన పాత్రల్లో కనువిందు చేయనున్నట్లు తెలిసింది. దీపికా పదుకొణె కథానాయిక. మృణాల్ ఠాకూర్, జాన్వీకపూర్ ముఖ్య పాత్రలు పోషిస్తున్నట్లు ప్రచారం వినిపిస్తున్నా.. ఇంకా అధికారిక ప్రకటన వెలువడలేదు.



## చరణ్ కోసం వెనక్కి తగ్గిన 'లెనిన్'

అక్కినేని అఖిల్ తన కెరీర్‌లో ఎలాగైనా భారీ హిట్ కొట్టాలనే పట్టుదలతో 'లెనిన్' చిత్రంపై గంపెడు ఆశలు పెట్టుకున్నాడు. మురళీ కిశోర్ అబ్బూరి దర్శకత్వంలో రాయలసీమ నేపథ్యంలో సాగే ఈ మాస్ యాక్షన్ డ్రామా కోసం అఖిల్ తన లుక్ నుంచి డైలాగ్ డెలివరీ వరకు చాలా మార్పులు చేసుకున్నాడు. ఇప్పటికే విడుదలైన టీజర్, పాటలకు మంచి స్పందన రావడంతో మే 1, 2026న విడుదల చేస్తామని చిత్రబృందం ప్రకటించింది. అయితే ఏప్రిల్ 30న రామ్ చరణ్ పాన్-ఇండియా చిత్రం 'పెద్ది'(జూవటటతి)వస్తున్నట్లు అధికారికంగా ప్రకటించడంతో 'లెనిన్' విడుదల తేదీ డైలమాలో పడింది. చరణ్ వంటి స్టార్ హీరో సినిమాకు కేవలం ఒక్కరోజు గ్యాప్‌లో రావడం బాక్సాఫీస్ వద్ద వసూళ్లపై, థియేటర్ల దొరకడంపై తీవ్ర ప్రభావం చూపుతుందని నిర్మాతలు ఆలోచిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే 'లెనిన్' మేకర్స్ తమ సినిమాను వాయిదా వేసే దిశగా ఆలోచిస్తున్నట్లు సమాచారం. 'పెద్ది' చిత్రానికి ఉన్న భారీ హైప్ దృష్ట్యా, అఖిల్ సినిమాకు సోలో రిలీజ్ దొరికితేనే అది బాక్సాఫీస్ వద్ద నిలబడగలదని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, అన్నపూర్ణ స్టూడియోస్ భావిస్తున్నాయట. అందుకే వాయిదా వేయాలని నిర్ణయించుకున్నట్లు టాక్. రామ్ చరణ్, అఖిల్ మధ్య మంచి స్నేహబంధం ఉంది. ఇప్పటికే ఈ క్లాష్‌పై ఇరు వర్గాల మధ్య చర్చలు జరిగినట్లు తెలుస్తోంది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, అన్నపూర్ణ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్న 'లెనిన్'ను మే మూడవ వారానికి లేదా జూన్ ఆరంభానికి వాయిదా వేసే అవకాశం ఉందని తెలుస్తోంది.



## తారక్‌లా ఇండస్ట్రీలో ఎవరూ ఉండరు.. జూనియర్ ఎన్టీఆర్‌పై ప్రశంసలు

ప్రముఖ బాలీవుడ్ నటి పూజా బేడీ చాలా తక్కువ సినిమాలే చేసింది. వాటిలో చిట్టెమ్మ మొగుడు (1993), శక్తి (2011) అని రెండు తెలుగు సినిమాలు కూడా ఉన్నాయి. అయితే చాలాకాలం తర్వాత మళ్లీ తెలుగు తెరపై సందడి చేసింది. చంద్రహాస్ హీరోగా నటించిన బరాబర్ ప్రేమిస్తా మూవీలో పూజా బేడీ కీలక పాత్రలో నటించింది. ఇటీవల ఈ సినిమా ఈవెంట్‌లో ఎన్టీఆర్‌పై ప్రశంసలు కురిపించింది పూజా బేడీ.

**నెగెటివ్ పాత్ర**

ఆమె మాట్లాడుతూ.. శక్తి సినిమా నేను సోనూసూద్‌కు భార్యగా నటించాను. నాది ప్రతికూల ఛాయలున్న పాత్ర. ఓ సీన్‌లో హీరో నాతో ఫైట్ చేయాల్సి ఉంటుంది. అందుకు జూనియర్ ఎన్టీఆర్ ఒప్పుకోలేదు. ఆడవారితో ఫైట్ చేయలేనని నిరాకరించారు. అప్పుడు ఆయనపై గౌరవం మరింత పెరిగింది. ఇప్పుడున్న సినీప్రపంచంలో ఇలాంటి విలువలు పాటించేవాళ్లు చాలా అరుదు అని తెలిపింది.

**తారక్ సినిమా**

జూనియర్ ఎన్టీఆర్ విషయానికి వస్తే ఆయన చివరగా వార్ 2లో కనిపించాడు. భారీ బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ పాన్ ఇండియా మూవీ బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్‌గా నిలిచింది. ప్రస్తుతం తారక్.. ప్రశాంత్ నీల్‌తో డ్రాగన్ మూవీ చేస్తున్నాడు. అలాగే దేవర 2 సినిమా కూడా లైన్‌లో ఉంది.






## అదే నా అసలైన విజయం

బాలీవుడ్ యంగ్ బ్యూటీ శనయా కపూర్ కెరీర్ ప్రయాణంపై చేసిన ఆసక్తికర వ్యాఖ్యలు సోషల్ మీడియాలో చర్చనీయాంశమయ్యాయి. తన తొలి చిత్రం 'ఆంఖోన్ కీ గుస్తాఖియాన్' ఆశించిన స్థాయిలో బాక్సాఫీస్ వద్ద సందడి చేయనప్పటికీ, ఆమె మాత్రం ఆ అనుభవాన్ని ఒక మధుర జ్ఞాపకంగా భావిస్తోంది.రివ్యూలు, ఫలితాలతో సంబంధం లేకుండా, తనను తాను మొదటిసారి వెండితెరపై చూసుకోవడం ఒక నటిగా తన జీవితంలోనే అది అతిపెద్ద విజయం అని.. ఆ క్షణాన్ని తాను పూర్తిగా ఆస్వాదించానని ఆమె స్పష్టం చేసింది. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న శనయా.. "థియేటర్ నిండా ప్రేక్షకులు ఉండాలని, అందరి ప్రేమను పొందాలని ఏ నటికైనా ఉంటుంది. కానీ నా మొదటి సినిమా విషయంలో అది పూర్తిగా జరగకపోయినా నేను కృంగిపోలేదు. వెండితెరపై నన్ను నేను మొదటిసారి చూసుకోవడమే నా అసలైన విజయంగా భావించాను. ఎందుకంటే ఆ సినిమా రిలీజ్ కోసం నేను చాలా కాలం వెయిట్ చేశాను. ఆ సమయంలో వచ్చిన ప్రేక్షకుల ఆదరణే నాకు గొప్ప ప్రేరణనిచ్చింది" అని తెలిపింది. సినిమా ఫలితం తనను మానసికంగా దెబ్బతీయలేదని, తన దృష్టంతా ఎప్పుడూ ముందడుగు వేయడం పైనే ఉంటుందని ఆమె ధీమా వ్యక్తం చేసింది. ఒక సినిమా ఫలితం తన స్క్రిప్ట్ ఎంపికలను మార్చలేదని.. కేవలం గుడ్డిగా వెళ్లకుండా, తన మనసుకు నచ్చిన కథలనే ఎంచుకుంటానని ఆమె పేర్కొంది. నా తదుపరి చిత్రం 'తూ యా మైన్' పనుల్లో బిజీగా ఉన్నాను. పనిలో నిమగ్నమవ్వడమే అన్ని సమస్యలకు పరిష్కారం" అని శనయా చెప్పుకొచ్చింది. భవిష్యత్తులో తాను చేయబోయే సినిమాల గురించి చెబుతూ.. కేవలం గ్లామర్ పాత్రలకే పరిమితం కానని ఆమె పేర్కొంది. "నేను రిస్క్ తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నాను. కొత్త జోనర్లను అన్వేషించాలనుకుంటున్నాను.

## గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు సిద్ధమైన 'రాకాస'

'కమిటీ కుర్రోళ్లు' సక్సెస్‌తో జాతీయ స్థాయిలో గుర్తింపును సంపాదించుకుని సక్సెస్‌ఫుల్ ప్రొడ్యూసర్‌గా అందరి దృష్టిని ఆకర్షించిన నిహారిక కొణిదెల..ఇప్పుడు మరో మూవీతో రాబోతున్నది. జీ స్టూడియోస్ సమర్పణలో తన పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్‌పై ఉమేష్ కుమార్ బన్సాల్‌తో నిర్మిస్తోన్న లేటెస్ట్ మూవీ 'రాకాస'. మ్యాడ్, మ్యాడ్ స్క్వేర్ చిత్రాలతో నటుడిగా మెప్పించిన సంగీత్ శోభన్ తొలిసారి సోలో హీరోగా ఇందులో నటిస్తున్నారు. మానస శర్మ దర్శకత్వం వహిస్తున్నారు. రీసెంట్‌గా రిలీజైన ఈ సినిమా గ్లింప్స్, టైటిల్ మోషన్ పోస్టర్‌కు ఆడియెన్స్ నుంచి అమేజింగ్ రెస్పాన్స్ వచ్చింది. దీంతో సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తి పెరిగింది. ఇప్పుడు ఇదే జోష్‌తో తాజాగా ఈ చిత్రం రిలీజ్ డేట్ అనౌన్స్ చేశారు మేకర్స్. 'రాకాస' చిత్రం వరల్డ్ వైడ్‌గా ఏప్రిల్ 3న గ్రాండ్ రిలీజ్ చేయబోతున్నట్లు ప్రకటించారు. దీనికి సంబంధించిన రిలీజ్ డేట్ పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేయగా.. ఇందులో సంగీత్ చేతిలో కాగడా పట్టుకుని చీకటిలో దేన్నో వెతుకుతున్నాడు. ఇది మరింత క్యూరియాసిటీని పెంచుతోంది.



Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s Sai Krishna Publications, Owned by M/s Sai Krishna Publications Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at Plot No. 3, Flat No.13, Surya Saroj Apartments, HUDA Complex, Saroornagar Ranga Reddy District.(Hyd) - 500 035, Telangana. Editor : V. SRINIVAS REDDY, cell:9440231967 RNI No. APTEL/2010/36516, prajajyothiadilabad@gmail.com